# 28 నుంచి 31 వరకు మేడారం మహాజాతర

అక్కడ గుడి ఉండదు... విగ్రహాలు కనిపించవు... వేదమంత్రాలు వినిపించవు... హోమాలు, యాగాల సందడే ఉండదు.. అయినా లక్షలాది మంది భక్తుల శరణు ఘోషతో జంపన్నవాగు శిగమూగుతుంది. వన దేవతల రాక కోసం లక్షల కళ్లు నిరీక్షిస్తాయి. అడవి నుంచి తల్లులను తీసుకొచ్చే గిరిజనపూజారుల కాళ్లు తాకేందుకు పొర్లు దండాలు పోటెత్తుతాయి. ఎదురుకోళ్లు గాలిలోకి ఎగురుతాయి. ప్రకృతి దేవతల కొలువైన మేడారం ఈసారి సరికొత్త రూపు సంతరించుకుంది. ఆదివాసీ సాంస్కృతిక వైభవానికి ప్రతీకలా కనిపించే...తెలంగాణలోని ములుగుజిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతరలోకి ఓసారి వెళ్లొద్దాం....

## మేడారం దారిలో పర్యాటకం!

జాతరమార్గంలో ఎన్నో చారిత్రక ఆలయాలు, పురాతన కట్టడాలు యాదగిరిగుట్ట నుంచి మల్లూరు హేమాచల లక్ష్మీనరసింహస్వామి వరకు అన్నీ ప్రత్యేకమే



**హైదరాబాద్ జనవరి 25 (ప్రభాతవార్త) :** ములుగుజిల్లా మేడారంలో మహాజాతర జరిగే నాలుగు రోజుల్లో(ఈనెల 28 నుంచి 31 వరకు) భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందనే భావనతో అనేక మంది ఆర్టీసీబస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఇప్పటికే వెళ్లి వస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ మీదుగా ప్రైవేట్ వాహనాల్లో మేడారానికి వెళ్లే భక్తులు దారిపొడవునా ఉన్న చారిత్రక కట్టడాలు, ఆలయాలను వీక్షించే అవకాశం ఉంది. కనీసం రెండు,మూడురోజులపాటు ప్రణాళికను రూపొందించుకుని వెళితే పలు ప్రాంతాలను సందర్శించవచ్చు. హైదరాబాద్ నుంచి సుమారు 278 కిలోమీటర్ల దూరంలో ఉన్న మేడారం దారిలోని సందర్శనీయ క్షేత్రాలను తెలుసుకుందాం.

### తొలుత.. యాదగిరిగుట్ట

తొలుత యాదాద్రిజిల్లాలోని భువనగిరి యాదగిరి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకోవచ్చు. తర్వాత 23 కిలో మీటర్ల దూరంలోని కొలనుపాకలోని 2 వేల ఏళ్ల నాటి జైన మందిరాన్ని కూడా సందర్శించవచ్చు. ఇందులో ఆదినాథుడు, మహావీరుడు, నేమినాథుడు లాంటి జైనదేవుళ్ల విగ్రహాలు ప్రధాన ఆకర్షణ.

### వేయి స్తంభాల గుడి...

హనుమకొండలోని వేయిస్తంభాల ఆలయాన్ని చూడవచ్చు.11వ శతాబ్దంలో కాకతీయ వంశానికి చెందిన రుద్రదేవుడి చేత చాళుక్యుల శైలిలో ఆలయాన్ని నిర్మించారు. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు భారీగా తరలివస్తారు. రుద్రేశ్వరస్వామిని భక్తిశ్రద్ధలతో కొలుస్తారు.

### భద్రకాళి ఆలయం...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రాల్లో భద్రకాళి గుడి ప్రఖ్యాతిగాంచింది. ఈ గుడి వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి సమీపంలో వరంగల్ హన్మకొండ ప్రధాన రహదారిపై పాలిటెక్నిక్ కాలేజీ నుంచి 1.5 కిలోమీటర్ల దూరంలో ఉంది. భద్రకాళీదేవీ విగ్రహం దాదాపు 9 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పుతో ఉంటుంది. ఏటా ఇక్కడ జరిగే శాకంబరీ ఉత్సవాలకు భక్తులు లక్షలాదిగా తరలివస్తుంటారు.

### రామప్ప గుడి...

వేయిస్తంభాల గుడి, భద్రకాళి ఆలయ దర్శనం అనంతరం మధ్యలో కాసేపు సేదతీరవచ్చు. తర్వాత ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట దగ్గర ఉన్న రామప్పగుడిని సందర్శించవచ్చు. ఇది కాకతీయ రాజులు నిర్మించిన చారిత్రక దేవాలయం. వరంగల్ పట్టణానికి 70 కి.మీ. దూరంలో ఉంది. ఇక్కడ ఇసుకపై ఆలయాన్ని నిర్మించారు. నీటిలో తేలియాడే ఇటుకలతో గోపురాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి యునెస్కో గుర్తింపు లభించింది.

### లక్నవరం సరస్సు.. తీగల వంతెన

రామప్ప గుడికి 22 కిలోమీటర్ల దూరంలోని లక్నవరం చెరువును సందర్శించవచ్చు. 1312లో ఓరుగల్లును పరిపాలించిన ప్రతాపరుద్రుడి చేతుల మీదుగా ఈ సరస్సు రూపుదిద్దుకుంది. ఎత్తయిన కొండల నడుమ నిర్మించిన సరస్సు నేటి ఆధునిక ఇంజనీరింగ్ పరిజ్ఞానాన్ని పోలి ఉంటుంది. కొన్నేళ్ల క్రితం సరస్సుపై నిర్మించిన వేలాడే తీగల వంతెన సందర్శకులను ఆకట్టుకుంటోంది.

### హేమాచల లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం...

ములుగుజిల్లా మంగపేట మండలం మల్లూరు గ్రామానికి 4 కిలోమీటర్ల దూరంలో ఏటూరు నాగారం భద్రాచలం ప్రధాన రహదారిని ఆనుకుని ఈ క్షేత్రం ఉంది. వరంగల్ నుంచి 130 కి.మీ., మేడారం నుంచి సుమారు 53 కి.మీ. దూరంలో ఉంది.

ఈ హేమాచల క్షేత్రం ప్రకృతి వైద్యానికి, వనమూలికలకు పెట్టింది పేరు. నవ నారసింహుల క్షేత్రాల్లో మొట్టమొదటిదిగా చెబుతుంటారు. స్వామివారి మూర్తి మానవ శరీరం లాగా మెత్తగా ఉంటుంది. స్వామి వారి ఛాతీ మీద రోమాలు కనిపిస్తుంటాయి. చింతామణి జలపాతం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణ.







# ఆకతాయిలకు 'షీ టీమ్స్' సింహస్వప్నం

* ఏడాదిలో 1,149 ఫిర్యాదుల పరిష్కారం
* క్షేత్రస్థాయిలో పకడ్బందీ నిఘా
* రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన 3,826 మంది పోకిరీలు



సిపి సజ్జనార్

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త**

నమ్మి స్నేహం చేశారు. ఆ చనువుతో కొన్ని వ్యక్తిగత ఫొటోలు పంచుకున్నారు. అదే ఇప్పుడు ఆమె మెడకు ఉచ్చులా మారింది.'డబ్బులిస్తావా.. ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టమంటావా?' అంటూ నిత్యం వేధింపులు. చావలేక.. బతకలేక నరకయాతన అనుభవించిన ఆ యువతి చివరకు 'షీటీమ్స్'ను ఆశ్రయించి విముక్తి పొందారు మరొకరు.. రోజూ ఆఫీస్‌కు వెళ్తుంటే చాలు, నీడలా వెంటపడటం.. ప్రేమించకపోతే చంపేస్తానంటూ బెదిరింపులు. ఫోన్ బ్లాక్ చేసినా కొత్త నంబర్లతో బూతులు తిడుతూ పైశాచిక ఆనందం. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ మహిళకు 'షీ టీమ్స్' అండగా నిలిచింది. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే కాదు.. హైదరాబాద్ నగరంలో ఎంతో మంది మహిళలు అనుభవించిన మూగవేదనకు ప్రతిరూపాలు.నగరంలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తూ, వేధింపులకు పాల్పడే ఆకతాయిల ఆటకట్టించడంలో హైదరాబాద్ షీ టీమ్స్ మరోసారి తమ సమర్థతను చాటుకున్నాయి. ఏడాదిలో మొత్తం 1149 ఫిర్యాదులు అందగా, వాటన్నింటినీ షీటీమ్స్ అత్యంత బాధ్యతాయుతంగా పరిష్కరించాయి.

### బ్లాక్‌మెయిలింగ్ భూతం.. 366 మందికి విముక్తి...

ఈ ఏడాది నమోదైన కేసులను విశ్లేషిస్తే.. అత్యధికంగా 366 మంది బాధితులు 'బ్లాక్‌మెయిలింగ్' సమస్యతోనే షీ టీమ్స్‌ను ఆశ్రయించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమై, తీయని మాటలతో నమ్మించి చనువు పెంచుకోవడం.. ఆపై వీడియో కాల్స్, వ్యక్తిగత ఫోటోల ద్వారా ఉచ్చు బిగించడం పరిపాటిగా మారింది. వీడియో కాల్ మాట్లాడుతున్నప్పుడు స్క్రీన్ రికార్డింగ్ చేయడం, పంపిన ఫొటోలను సేవ్‌చేసుకుని డబ్బుల కోసం వేధిస్తున్నారు. మరికొన్ని కేసుల్లో.. ప్రేమ విఫలమైన తర్వాత, పాత ఫొటోలను అడ్డం పెట్టుకుని మాజీ ప్రేమికులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. "నాతో మాట్లాడకపోతే, వేరే పెళ్లి చేసుకుంటే.. మన పాత ఫోటోలు నీ కాబోయే భర్తకు పంపిస్తా" అంటూ వేధిస్తున్న 366 కేసుల్లో షీ టీమ్స్ బాధితులకు అండగా నిలిచింది.

### సాంకేతికత మాటున వేధింపులు

కొందరు ప్రబుద్ధులు స్మార్ట్ ఫోన్లు, సోషల్ మీడియా యాప్స్ చాటున దాక్కుని మహిళలను వేధిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో నిద్రపోనివ్వకుండా చేయడం, కొత్త నంబర్లు, ఇంటర్నెట్ కాల్స్ ద్వారా అసభ్యంగా మాట్లాడుతూ పైశాచిక ఆనందం పొందడంవంటి ఘటనలు 121 నమోదయ్యాయి. ఈ తరహా కాల్స్‌వల్ల తీవ్ర మానసిక క్షోభ అనుభవించామంటూ 50మంది మహిళలు ఫిర్యాదు చేయగా, పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో నకిలీ ఐడీలు సృష్టించి వేధించడం, వాట్సాప్ ద్వారా అసభ్యకరమైన కంటెంట్ పంపడం వంటి 82 కేసులను పోలీసులు పరిష్కరించారు.

### ప్రేమ పేరుతో వల.. పెళ్లి అనగానే జలక్..

ఈ ఏడాది అత్యంత ఆందోళన కలిగించే విషయం.. ప్రేమ, పెళ్లి పేరుతో జరిగిన మోసాలు. "నిన్ను పెళ్లి చేసుకుంటా" అని నమ్మించి శారీరకంగా లోబరుచుకోవడం, ఆర్థికంగా వాడుకోవడం, తీరా పెళ్లి ప్రస్తావన రాగానే ముఖం చాటేయడం వంటి 98 ఫిర్యాదులు అందాయి. ఇలాంటి కేసుల్లో బాధితులు తీవ్ర డిప్రెషన్‌లోకి వెళ్తున్నారు. షీటీమ్స్ వీరికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు, మోసగాళ్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయించింది.మఫ్టీలో నిఘా.. 3,826 మందికి కౌన్సెలింగ్...

కేవలం ఫిర్యాదులేకాకుండా, క్షేత్రస్థాయిలోనూ షీ టీమ్స్ దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. నగర వ్యాప్తంగా 15 బృందాలు బస్టాండ్లు, కాలేజీలు, రద్దీ ప్రదేశాల్లో మఫ్టీలో నిఘా వేసి, 2025లో ఏకంగా 3,826 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన వారిలో మెజారిటీ ఆకతాయిలకు కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇవ్వగా, తీవ్రత ఎక్కువగా ఉన్న ఘటనల్లో ఎఫ్.ఐ.ఆర్ లు నమోదు చేసి జైలుకు పంపారు.

### ఆడబిడ్డల జోలికొస్తే.. కఠిన చర్యలు తప్పవు వీసీ సజ్జనర్

"మహిళల జోలికొస్తే.. ఇక మీఆటలు సాగవు. ముఖ్యంగా 'బ్లాక్‌మెయిలింగ్' పేరుతో ఆడబిడ్డలను భయపెట్టాలని చూస్తే, మీ భవిష్యత్తు జైలు గోడల మధ్యే అంతమవుతుంది. సోదరీమణులారా.. అధైర్యపడకండి. మీ వివరాలు బయట పడతాయన్న భయం అస్సలు వద్దు, వాటిని అత్యంత గోప్యంగా ఉంచుతాం. వేధింపులను మౌనంగా భరించకండి.. ఎదురించండి. మీరు ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు.. మీకు రక్షణ కవచంలా నిలబడటానికి 'షీ టీమ్స్' ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాయి. ఆపదలో ఉన్నా, వేధింపులకు గురవుతున్నా తక్షణమే డయల్ 100 లేదా షీ టీమ్స్ వాట్సాప్ నెంబర్ 9490616555 ను సంప్రదించండి.

# బాలికల వసతి గృహంలో అగ్నిప్రమాదం

◆ ఆరుగురు బాలికలకు అస్వస్థత ◆ ఎసి నుంచి మంటలు రావడంతోనే ప్రమాదం



ప్రమాదం జరిగిన భవనం



ఆసుపత్రిలో చికిత్స పొందుతన్న విద్యార్థినిలు

**అల్వాల్, జనవరి 25 ప్రభాతవార్త:** అల్వాల్‌లో ఓప్రైవేటు కార్పొరేటర్ కళాశాలకు చెందిన బాలికల వసతి గృహంలో అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగినట్లు తెలుస్తుండగా ఎసి నుంచి మంటలు వ్యాప్తి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ప్రమాదం అనంతరం దట్టమైన పొగ అలముకోవడంతో ఊపిరిఆడక విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కళాశాల సిబ్బంది సకాలంలో స్పందించి వారిని ఆసుపత్రికి తరలించారు. ప్రాణ నష్టం లేక పోయినా బాలికలు నిద్రిస్తున్న గది పూర్తిగా కాలి పోవడం జరిగింది. ఇక ప్రమాదానికి సంబంధించి స్థానిక పోలీసుల యంత్రాంగం, అగ్నిమాపక దళానికి చెందిన అధికారులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ హైటెన్షన్ రోడ్డు, సిటిజన్ కాలనీలో నైన్ ఎడ్యుకేషన్ కళాశాలకు చెందిన హాస్టల్ బహుళ అంతస్తుల భవనంలో ఉంది. నాలుగు అంతస్తులు ఉన్న భవనంలోని 4లో బాలికలు, 3లో బాలుర వసతిగృహాలను ఏర్పాటు చేశారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. బాలురు, బాలికలు కలిసి 130 మంది వరకు వసతి గృహంలో ఉంటున్నారు. ఆదివారం తెల్లవారు జామున నాలుగో అంతస్తులో ఉన్న బాలికల వసతి గృహం బయట ఉన్న ఎసి నుంచి పొగలు రావడం ప్రారంభమైంది. ఆ సమయంలో మొబైల్ ఫోన్‌లులో బిజీగా ఉన్న విద్యార్థులు గమనించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎసి ఒక్కసారిగా పేలడంతో మంటలు తీవ్రత పెరిగిందని తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో గదిలో విద్యార్థినిలు నిద్రిస్తున్నారు. హాస్టల్ సిబ్బంది తలుపులు తట్టి లేపపడం అప్పటికే గది నిండా పొగకమ్ముకోవడం జరిగింది. ఈ కారణంగా విద్యార్థినిలకు ఊపిరి తీసుకోవడం కష్టంగా మారింది. వీరంతా ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. అంబులెన్స్‌లో వారిని కొంపల్లిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అగ్నిమాపక వాహనం ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చింది. వసతి గృహంలో జరిగిన ప్రమాదంలో హర్షిత, హర్షిని, దీప్తి, సహస్ర, లోహిత, వర్షినిలు అస్వస్థకు గురైన వారిలో ఉండగా, వారు కోలుకున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాదం జరిగినగదిలోని వస్తువులు అన్నీ అగ్నికి ఆహుతి అయ్యాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఎసి నుంచి మంటలు వ్యాప్తి చెందాయని ప్రాథమికంగా జరిపిన విచారణలో తేలింది. ఇదిలా ఉండగా బహుళ అంతస్తుల భవనాలులోని కళాశాలలు, వసతి గృహాలు నియమ నిబంధనలను ఎంతవరకు పాటిస్తున్నాయన్నది ప్రశ్నగా మారింది. ఒకే భవనంలో బాలురు, బాలికల వసతి గృహం నిర్వహిస్తుండడం విశేషం. తెల్లవారు జామున మంచి నిద్రలో ఉన్న సమయంలో ప్రమాదం జరగడం, అదృష్టవశాత్తు దానిని సకాలంలో గమనించి అప్రమత్తం కావడంతో భారీ మానవీయ ప్రమాదం తప్పినట్లు అయ్యింది.

# పార్కింగ్ కష్టాలకు చెక్

### ఈవీ ఛార్జింగ్ సౌకర్యంతో పజిల్ పార్కింగ్




**హైదరాబాద్, జనవరి 25 ప్రభాతవార్త**

ఎప్పుడూ రద్దీగా ఉండే నాంపల్లి రోడ్డులో పార్కింగ్ కష్టాలు తీరనున్నాయి. దేశంలోనే తొలి ఆటోమేటెడ్ మల్టీ లెవెల్ పార్కింగ్ సిస్టమ్ అందుబాటులోకి వచ్చింది. నిఘా భద్రత, మనుషులతో పనిలేకుండా సెన్సార్ పార్కింగ్ సిస్టమ్, చార్జింగ్ కోస సోలార్, ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఈ మల్టీ లెవల్ పార్కింగ్ సిస్టమ్‌లో అందుబాటులో ఉన్నాయి. ఎంతో కాలంగా నాంపల్లి రైల్వే స్టేషన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యకు ఈ ఏర్పాటు పరిష్కారం చూపనుంది. ఆదివారం నాంపల్లిలో ఆటోమేటెడ్ మల్టీలెవెల్ పార్కింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించారు. మొత్తం 15 అంతస్తుల కాంప్లెక్స్‌లో పది అంతస్తులలో మల్టిలెవల్ పార్కింగ్‌కు ఐదు అంతస్తులలో షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లతో అటు పార్కింగ్ రిలీఫ్, ఇటు షాపింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. మూడు బేస్‌మెంట్లలో 10 అంతస్తులలో వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు అవకాశం ఉంది. 250 కార్లు, 150 నుంచి200 దాకా బైకులను పార్కింగ్ చేసుకోవచ్చు. రోబోటిక్ పార్కింగ్ సిస్టమ్, ఏఐ ఆధారిత నిఘా, సోలార్ శక్తితో, ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల సదుపాయం ఈ కాంప్లెక్స్ అందుబాటులో ఉంది. ఎంతో కాలంగా నాంపల్లి రైల్వే స్టేషన్, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ సమస్యకు ఈ ఏర్పాటు పరిష్కారం చూపనుంది.

### పిపిపి మోడల్...

రూ.150 కోట్లతో ఈ ఆటోమేటెడ్ మల్టీ లెవెల్ పార్కింగ్ ప్రాజెక్టును పబ్లిక్, ప్రయివేట్ పార్టనర్ షిప్ (పీపీపీ) మోడ్‌లో హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది. టెక్ ఫౌండర్ హరికిషన్‌రెడ్డి, అతని భార్య భావనరెడ్డి యాజమాన్యంలోని నోవమ్ కంపెనీ భాగస్వామ్యంలో ఆ ప్రాజెక్టును నిర్మించారు. ఈ ప్రాజెక్టును బిజినెస్ పరంగా డెవలప్ చేసేందుకు షాపింగ్ మాల్స్ కోసం మరో ఐదు అంతస్తులను కేటాయించారు. 11వ అంతస్తులో రెండి సినిమా థియేటర్లు,గ్యాలరీలను ఏర్పాటు చేశారు. ఇక ఈ ఆటోమేటెడ్ పార్కింగ్ సిస్టమ్ పూర్తిగా సెన్సార్ల ద్వారా నడుస్తుంది.

# పేరులోనే ఫైర్

* నామమాత్రపు జరిమానాలు, శిక్షలతోనే సరి
* దీంతో ఉల్లంఘనదారుల్లో కనిపించని భయం
* కోరల్లేని రాష్ట్ర అగ్నిమాపక సేవల చట్టం
* మళ్లీ మళ్లీ చోటు చేసుకుంటున్న అగ్నిప్రమాదాలు

**హైదరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త**

రాష్ట్ర అగ్నిమాపక సేవల చట్టం కోరలు లేని పాములాగా తయారైంది. తరచుగా భారీ అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ఉల్లంఘనదారుల్లో భయం కనిపించడంలేదు. ఈ చట్టం కింద అభియోగాలు నమోదు చేసే ప్రక్రియ ఓ ప్రహసనంగా మారింది. ఒకవేళ నేరం రుజువైనా పెద్దగా శిక్షలు లేకపోవడం,నామమాత్రపు జరిమానాలే ఉండటం ఇందుకు కారణం. అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖకు ఉన్న ఒకే ఒక్క ఆధారం ఏపీ ఫైర్ సర్వీసెస్ యాక్ట్, 1999లో రూపొందించిన ఈ కోరలు లేని చట్టమే ఇప్పటికీ వినియోగంలో ఉండటమే ప్రధాన కారణం. పోలీసులు ఐపీసీ, సీఆర్పీసీ సెక్షన్ల కింద కేసు నమోదు చేస్తే తప్ప నిందితులను అరెస్టు చేసే అవకాశం లేకపోవడంతో అగ్నిమాపక సేవల చట్టం నామమాత్రంగా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అగ్నిమాపక శాఖ ఏదైనా ఎస్టాబ్లిష్మెంట్ ఉల్లంఘనలు గుర్తించినా నేరుగా చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది. పలు మార్లు నోటీసులు జారీ చేసి గడువిచ్చాక డీజీ అనుమతి మేరకు విచారణకు అవకాశం ఉంటుంది. ఆ తర్వాత కేసు నమోదు చేసి నివేదికను న్యాయస్థానంలో సమర్పిస్తారు. ఏళ్ల తరబడి విచారణ జరిగిన తర్వాత చాలా కేసులు సరైన ఆధారాల్లేక వీగిపోతుంటాయి. ఒకవేళ కేసు రుజువైనా అగ్నిమాపక సేవల చట్టం ప్రకారం పడే జరిమానా రూ.వేలల్లోనే ఉంటుంది.

ఏదైనా నేరానికి సంబంధించి పోలీసు విభాగం ఐపీసీ కింద కేసు నమోదు చేస్తుంటుంది. నేరం, నేరగాడి తీరుతెన్నుల్ని బట్టి ఆరెస్టుపై నిర్ణయం తీసుకుంటుంది. ఆపై జైలు, బెయిలు, కోర్టులో కేసు విచారణ తదితరాలు ఉంటాయి. అదే ఫైర్ సర్వీసెస్ యాక్ట్ వద్దకు వచ్చేసరికి ఆ చట్టం, అగ్నిమాపక శాఖకు ఉన్న అధికారాలు వేరు. వీళ్లు ఫైర్ సేఫ్టీ ఉల్లంఘనలకు సంబంధించి కేసు నమోదు చేసినప్పటికీ నోటీసుల జారీ మినహా అరెస్టుకు ఆస్కారం లేదు. ఈ కేసు కోర్టు వరకు వెళ్లినా సాధారణ కేసుల్లా విచారణ ఉండదు. అది ఎందరి ప్రాణాలు తీసిన ఉదంతం, ఎంత తీవ్రమైన ఉల్లంఘన అయినప్పటికీ ఇదే పరిస్థితి. ఈ కేసుల విచారణ సివిల్ కోర్టుల్లో సమరీ ట్రయల్ విధానంలో జరుగుతుంది. ఈ చట్టంలోని అనేక సెక్షన్లు ఉన్నప్పటికీ శిక్షలుమాత్రం చాలా తక్కువ. దాదాపు 90 శాతం ఉల్లంఘనలకు జరిమానా మాత్రమే విధించే ఆస్కారం ఉంది. మిగిలిన వాటిలోనూ గరిష్ట శిక్ష కేవలం 3 నెలలు మాత్రమే. ఈ సెక్షన్లకు సంబంధించిన ఉల్లంఘనల్లోనూ పెనాల్టీ విధించే ఆస్కారం ఉంది. కఠినమైన శిక్షలు, భారీ జరిమానాలు లేకపోవడంతో ఉల్లంఘనదారుల్లో భయం లేదని అభిప్రాయం వెల్లడవుతుంది.

తెలంగాణ అగ్నిమాపక శాఖ 2020 జూన్‌లో అగ్ని మాపక చట్టానికి పలు సవరణలు సూచిస్తూ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించింది. భారీ జరిమానాలు, జప్తు చేయడం తదితర కఠిన నిబంధనలు ఇందులో చేర్చారు. వీటికి ఆమోదం లభిస్తే ఢిల్లీ తర్వాత దేశంలోనే బలమైన చట్టం గల రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని ఆ శాఖ ఉన్నతాధికారులు అభిప్రాయపడ్డారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి అగ్నిమాపక శాఖ నమోదు చేసిన కేసుల్లో అత్యధికంగా హైదరాబాద్‌కు సంబంధించినవే ఉన్నాయి. గత దశాబ్ద కాలంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందింది. ఆకాశ హార్మ్యాలు, వాణిజ్య భవనాలు కోకొల్లలుగా వెలిశాయి. ఈ స్థాయిలో అగ్నిమాపక శాఖ కూడా అప్‌గ్రేడ్ కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక యంత్రాలు, రోబోలతో పాటు చట్ట సేవరణ చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ అగ్నిమాపక శాఖ 2020 జూన్‌లో అగ్నిమాపక చట్టానికి పలు సవరణలు సూచిస్తూ ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించింది. భారీ జరిమానాలు, జప్తు చేయడం తదితర కఠిన నిబంధనలు ఇందులో చేర్చారు. వీటికి ఆమోదం లభిస్తే ఢిల్లీ తర్వాత దేశంలోనే బలమైన చట్టం గల రాష్ట్రంగా తెలంగాణ అవతరిస్తుందని ఆ శాఖ ఉన్నతాధికారి ఒకరు అభిప్రాయపడ్డారు.

# ఘనంగా రథసప్తమి వేడుకలు

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉత్సవమూర్తులకు ఉదయం సూర్యప్రభ వాహన సేవ, అనంతరం చిన్న శేష వాహన సేవ, హనుమం వాహన సేవలను నిర్వహించారు. ఈ వాహన సేవల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వారి విశేష సేవలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరవ్వడమే కాకుండా స్వామి వారి మూర్తులను అఖండ భక్తజనసందోహం మధ్య పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు అన్ని చర్యలు చేపట్టారు.

### టిటిడి ఆధ్వర్యంలో...

**సైఫాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** రథసప్తమిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం హిమాయత్‌నగర్‌లోని టిటిడి శ్రీవేంకటేశ్వర స్వామి బాలాజీ భవన్ ఆధ్వర్యంలో రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవంలో వందలాది మంది భక్తులు పాల్గొని రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. పురవీధులన్ని గోవింద నామస్మరణలతో మార్మోగాయి. రథాన్ని, దేవాలయాన్ని పూలమాలలతో, మంగళ తోరణాలతో అందంగా అలంకరించి రథంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని కుర్చుండ బెట్టి హిమాయత్‌నగర్‌లోని పలు పురవీధుల్లో ఊరేగించడం జరిగింది. భక్తులు రోడ్డుకు ఇరువైపుల నిలబడి శ్రీవారిని దర్శించుకుని తరించారు. భక్తులకు అర్చకులు హారతితోపాటు తీర్థప్రసాదాల వితరణ గావించారు.రథోత్సవంలో పాల్గొనేందుకు భక్తులు ఉదయం 5గంటల నుంచే దేవాలయంకు రావడం ఆరంభించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ రథోత్సవంలో దేవాలయం లోకల్ అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ నేమూరి శంకర్‌గౌడ్ దంపతులు, టిటిడి ప్రత్యేక అధికారి యు.రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసమణికంఠ, సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్సీ

**దుండిగల్, జనవరి 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మేడ్చల్‌జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు స్పష్టం చేశారు. ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీల ప్రతినిధులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు దృష్టికి తీసుకొచ్చి, పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన, వాటిపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని, ప్రజా అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, కొలన్ రాజశేఖర్‌రెడ్డి

**నిజాంపేట్, జనవరి 25, ప్రభాతవార్త :** రథసప్తమి సందర్భంగా నిజాంపేట్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయం, శిల్ప పారడైజ్ కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రగతినగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎంసి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రఫియాబేగం, ఏవిరెడ్డి, రామకృష్ణారెడ్డి, బిక్కన్‌షా, లలితరెడ్డి, శివారెడ్డి, ప్రదీప్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, మహేష్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీకృష్ణ, రుక్మానందరెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులను ఆదుకోవాలి: కార్పొరేటర్



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న మార్వాడి యువమంచ్ ప్రతినిధులు

**బేగంబజార్, జనవరి 25, ప్రభాతవార్త:** అంగవైకల్యంతో బాధపడుతున్నవారిలో మానసికస్థైర్యాన్ని నింపేందుకుగాను మార్వాడి యువమంచ్ చేస్తున్న సేవలు బేష్ అని కార్పొరేటర్ జి.శంకర్‌యాదవ్ అన్నారు. మార్వాడి యువ మంచ్ ఆధ్వర్యంలో ఉచిత కాలిఫర్ క్యాంపును నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో శంకర్‌యాదవ్ పాల్గొన్ని మాట్లాడుతూ అంగవైకల్యంతో బాధపడుతున్నవారికి కొలతలు తీసుకుని అక్కడికక్కడే పరిష్కార మార్గాన్ని చూపించడం వెలకట్టలేనిదన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్ శంకర్‌యాదవ్‌ను శాలువకప్పి సన్మానించారు. కార్యక్రమంలో వ్యవస్థాపకులు లలిత్‌జైన్, అధ్యక్షులు మహేందర్ బండారి, శత్రుఘ్నమాన్‌సింగ్, మహేష్, ఉపాధ్యాయ, బిజెపి నాయకులు సుధీర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా చిత్తారమ్మ దేవి జాతర మహోత్సవాలు


కొలన్ హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**జీడిమెట్ల, జనవరి 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం పరిధిలోగల చిత్తరమ్మదేవి జాతర సందర్భంగా, ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు ప్రత్యేక పూజల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న ఆయన, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం జాతర నిర్వహణకు సంబంధించి పోలీస్ శాఖ, మున్సిపల్ శాఖలు చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించి, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించండి

**బేగంపేట జనవరి 25, ప్రభాతవార్త:** బస్తీ శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న సమస్యలు పరిష్కరించాలంటూ ఆదివారం ఓల్డ్‌బోయిన్ పల్లి మాల బస్తీ వాసులు ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పోరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ను కల్సి విజ్ఞప్తి చేసారు. ఎంతో కాలంగా మాల బస్తీ శ్మశానవాటికలో అసంపూర్తిగా ఉన్న వెయిటింగ్ హాలు, మౌళిక సదుపాయాలతో పాటు వాచ్మెన్ ఏర్పాటు చేయాలని కోరుతూ బస్తీవాసులు కార్పొరేటర్ ముద్దంను కోరారు. స్పందించిన ముద్దం వెంటనే ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ తో సంప్రదించి నిర్మాణ వ్యయం అంచనా వేసి వెంటనే అసంపూర్తిగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానంటూ వారికి హామీ ఇచ్చారు. కార్పొరేటర్ ను కల్సిన వారిలో ప్రదీప్‌కుమార్, సత్యనారాయణ, రామారావు, రాజు, మధుసూదన్, సత్యనారాయణ, నర్సింగరావు, చంటి, సాయి, శ్రీధర్, మల్లేశ్వరి, కళావతి, యశోద, సరళ తదితరులు పాల్గొన్నారు.


కార్పొరేటర్ ముద్దంకువినతి పత్రం అందిస్తున్న మాల బస్తీవాసులు

# కష్టజీవుల శ్రమైకచిత్రమే 'నా జీవనయాత్ర'

### రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి


నా జీవనయాత్ర గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న రమణాచారి, గౌరీశంకర్, వెంకటరెడ్డి తదితరులు

**నాంపల్లి, జనవరి 25 ప్రభాతవార్త :** కష్టజీవుల శ్రమైక జీవనచిత్రమే కర్నాటి లింగయ్య రచించిన ఆత్మకథ నా జీవనయాత్ర గ్రంథమని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి అన్నారు. భారతదేశ ప్రఖ్యాత ఆర్థిక శాస్త్రవేత్త సాహిత్యవేత్తగా పరిగణింపబడేస్థాయికి రావడం 17 గ్రంథాలు రాయడం, 37 గ్రంథాలను ప్రచురింపజేయడం అభినందనీయమన్నారు. ఉపన్యాసకుడుగా, సాహితీవేత్తగా అన్నింటికిమించి సామాజిక సేవకుడుగా ఉండడం చాలా గొప్పనైన విషయమన్నారు. సాధన సాహితీ స్రవంతి, నందనవన సాహితీ సమితి సంయుక్త ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని కె.వి.రమణ క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఉదయం ఆచార్య టి. గౌరీశంకర్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమణాచారి విశిష్ట అతిథులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య మసన చెన్నప్ప, డా. రాధశ్రీ, సాధన నరసింహాచార్య, కర్నాటి ప్రసాద్, కాశీ విశ్వేశ్వరరావు, రచయిత డా. కర్నాటి లింగయ్య తదితరులతో కలిసి ప్రముఖ ఆర్థికవేత్త, సాహితీవేత్త డా. కర్నాటి లింగయ్య సాహిత్య స్వర్ణోత్సవాన్ని పురస్కరించుకొని వ్రాసిన ఓ క్రియాశీలి ఆత్మకథ నా జీవనయాత్ర గ్రంథాన్ని ఆవిష్కరించి రచయితను సత్కరించి శుభా భినందనలు తెలిపారు. అనంతరం వెంకటరెడ్డి, చెన్నప్ప, గౌరీశంకర్ మాట్లాడారు. సిండికేట్ బ్యాంక్ మాజీ ఏజీఎం డా. రాధాశ్రీ గ్రంథ సమీక్ష కావించారు.



అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న క్రైస్తవులు

## క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలి

**సైఫాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ఈ దాడులను ప్రజాస్వామిక వాదులు ఖండించాలని, మత మార్పిడి పేరుతో జైల్లో వేసిన ఖైదీలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం క్రైస్తవులు ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఒరిస్సాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులకు సేవ చేస్తున్న పాస్టర్ డా.గ్రహం స్టెయిన్స్ అతని ఇద్దరు కుమారులను సజీవదహనం చేసిన సందర్భంగా 27వ వర్ధంతిని పురస్కరించుకుని క్రైస్తవులు ఈ ఆందోళణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సిఐసి ఫౌండర్ సిఎ డానియేల్ ఆడమ్స్ మాట్లాడుతూ దేశంలోని క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, జైలులో మగ్గుతున్న క్రైస్తవులను తక్షణమే విడుదల చేయాలని, పాస్టర్ల పైన పెట్టిన తప్పుడు కేసులను ఉపసంహరించుకోవాలని, దాడులకు ముఖ్య కారణమైన బజరంగ్‌దళ్‌పై నిషేదం విధించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సంఘాల నాయకులు జెరుసలేం మత్తయ్య, పెరికె వరప్రసాద్, ఎస్తేర్ రాణి, జవహర్ కెన్నడి, గ్లోరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిప్రపత్తులతో సూర్య భగవానుడి జన్మదినం

**చాంద్రాయణగుట్ట, జనవరి 25, ప్రభాతవార్త:** ప్రత్యక్ష భగవానుడు, సూర్యనారాయణడి జన్మదినోత్సవం రథసప్తమిని ఆదివారం పాతబస్తీ వ్యాప్తంగా భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. సమీప ఆలయాలలో, ఇళ్ళలో సూర్యనారాయణునికి ప్రత్యేక పూజలు చేశారు. చాంద్రాయణగుట్ట శ్రీ రామాలయం, శ్రీ దేవి దేవాలయం, గౌలిపురా శ్రీఅయ్యప్పస్వామి దేవాలయం, ఛత్రినాక శ్రీ లక్ష్మణేశ్వర స్వామి దేవాలయం, రక్షాపురం శ్రీ ఉమామహేశ్వరస్వామి దేవాలయం తదితర ప్రాంతాలలోని దేవాలయాలలో గల నవగ్రహాలలో ఒకరైన సూర్య భగవానుడిని దర్శించుకున్నారు. ఆదిత్య హృదయాన్ని పారాయణం చేశారు. ఇష్టమైన నైవేద్యాలు, కొబ్బరి కాయాలు సమర్పించి కర్పూర నీరాజనాలిచ్చారు. తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకున్నారు. రథసప్తమిని పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

**వేడుకగా కోడళ్ల పండుగ...**

కోడళ్ల పండుగను పాతనగరంలో వేడుకగా జరుపుకున్నారు. పుట్టినింటి నుండి మెట్టినింట్లో సపర్యలు చేస్తున్న కోడళ్ళకు ముత్తైదువలు పసుపు, కుంకుమ, పువ్వులు, చీరలు పెట్టారు. వారికి ఇష్టమైన పిండి వంటలు చేసి వడ్డించారు. బహుమానాలు అందజేశారు. వారు సంతోషించేలా సేవలు చేశారు. మెట్టినింటి వంశాభివృద్ధి, కుటుంబ అభ్యున్నతి కోసం కోడళ్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు.

## పాతబస్తీలో జాతీయ ఓటర్ల దినోత్సవం

**చాంద్రాయణగుట్ట, జనవరి 25, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని చార్మినార్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంచార్జి కె.వెంకటేష్ కోరారు. 16వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పలు పోలింగ్ కేంద్రాలలో విద్యార్థులకు ఓటరు నమోదు ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకమన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదు చేసుకొవాలని సూచించారు. దేశానికి దశ దిశ నిర్దేశించేది ఓటు మాత్రమేనన్నారు. పలు పోలింగ్ కేంద్రాలలో బిఎల్ఓల సమస్యలను తెలుసుకొని తగిన సూచనలు చేశారు. అదేవిధంగా గౌలిపురా ఆలె నరేంద్ర స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని పోలింగ్ కేంద్రంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు ఓటరు నమోదు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్, జి.రఘుకాంత్, కె.శోభారాణి తదితరులు పాల్గొన్నారు.


యువకుడికి ఓటరు నమోదు పత్రాన్ని అందజేస్తున్న బిఎల్ఓలు


రాజేష్‌కుమార్‌కు నియామకపత్రాన్ని అందిస్తున్న ఎన్నికల అధికారి సురేందర్

## బబ్బుగూడ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రాజేష్‌కుమార్

**యూసుఫ్‌గూడ, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రతి రెండు సంవత్సరాలకొకసారి జరిగే బస్తీ ఎన్నికల్లో భాగంగా మోతీనగర్ ప్రాంతంలోని బబ్బుగూడ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. బస్తీలో మొత్తం 271 ఓట్లు ఉండగా 267 ఓట్లుపోలయ్యాయి ఒక ఓటు చెల్లలేదు. కె.రాజేష్‌కుమార్ (నాని)కి 143 ఓట్లు పోలవగా మాజిద్ ఖాన్‌కు 123 ఓట్లు పోలయ్యాయి 20 ఓట్ల మెజారిటీతో కె.రాజేష్‌కుమార్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గెలుపొందారు. బస్తీలో పెండింగ్‌లో ఉన్న పనులను అందరి సహకారంతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని తనపై నమ్మకంతో తనకు ఓట్లు వేసి గెలిపించిన బస్తీ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎస్ సురేందర్‌గౌడ్ వ్యవహరించారు.

## 29న మంగళంపల్లి మహమ్మాయిదేవి కల్యాణ రథోత్సవాలు

**చాంద్రాయణగుట్ట, జనవరి 25, ప్రభాతవార్త :** విశ్వబ్రాహ్మణుల ఇలవేల్పు మంగళంపల్లి మహమ్మాయిదేవి కల్యాణ రథోత్సవ మహోత్సవాలు ఈనెల 29వ తేదీ గురువారం ప్రారంభమై ఫిబ్రవరి 3వ తేదీ మంగళవారం వరకు జరుగుతాయి. ఉత్సవాల తొలిరోజు, 29వ తేదీ గురువారం అంకురార్పణ, 30వ తేదీ శుక్రవారం ధ్వజారోహణం, 31వ తేదీ శనివారం రాత్రికి కల్యాణోత్సవం, ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రథోత్సవం (లంకాదహనం), 2వ తేదీ సోమవారం త్రిశూలోత్సవం, 3వతేదీ మంగళవారం చక్రస్నానం (దీపోత్సవం) పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. చార్‌కమాన్ స్వర్ణకార యూనియన్ ఆధ్వర్యంలో అన్నదానం, మంగళంపల్లి శ్రీ మహమ్మాయిదేవి సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం, అమ్మవారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, మంగళ సూత్రాలు, మట్టెల సమర్పణ, అమ్మవారి అలంకరణ, పల్లకి సేవా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ ఉత్సవాలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని విశ్వబ్రాహ్మణులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారు.

## క్రీడాకారులకు కిట్స్, సర్టిఫికెట్స్ పంపిణీ

**చిక్కడపల్లి, జనవరి 25 (ప్రభాతవార్త) :** ప్రైమ్ మినిస్టర్ సన్సద్ ఖేల్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అడిక్ మెట్ డివిజన్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయి కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లి సరోజినీ అకాడమీ లో క్రికెట్ ఆడిన క్రీడాకారులకు కిట్స్ , సర్టిఫికెట్స్ పంపిణి చేసారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రొయ్యూరు శేషశాయి, డివిజన్ పార్టీ ప్రధానకార్యదర్శులు కే. రాజకుమార్, జి. జనార్దన్ రెడ్డి, పార్టీ నాయకుడు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పెద్దమ్మతల్లికి విశేష పూజలు..

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త :** జూబ్లీహిల్స్ పెద్దమ్మతల్లి దేవాలయ 33వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఆలయంలో ఆదివారం భక్తజన సందోహం మధ్య వార్షికోత్సవ వేడుకలు కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3 గంటలకు పెద్దమ్మతల్లికి అభిషేకం నిర్వహించారు. 6 గంటలకు దర్శనం, హారతి, 8 గంటలకు నవగ్రహ, రుద్ర ఛండీహోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటలకు రథపూజను నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి, కలశోద్వాసన పూజలను వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తజనం మధ్య ఆదివారం సాయంత్రం పెద్దమ్మతల్లి ఉత్సవ మూర్తిని రథంపై ఊరేగించారు. రథోత్సవం నేపథ్యంలో విషేణ బాణసంచా నిర్వహించారు. వివిధ రకాల బాణసంచాల వినాస్యాలను వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. మరోవైపు పెద్దమ్మతల్లి ఉత్సవమూర్తిని అత్యంత వైభవంగా ఊరేగించారు. ఈ వేడుకల్లో ఆలయ వ్యవస్థాపన ట్రస్టీ సభ్యుడైన పి. విష్ణువర్ధన్‌రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈఓ శ్రీనివాసరాజు అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టారు.


దేవలయంల ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితుల


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

## చిత్తారమ్మ తల్లి భక్తులను కరుణించాలి : ఎమ్మెల్యే

**జీడిమెట్ల, జనవరి 25, ప్రభాతవార్త :** చిత్తారమ్మ తల్లి భక్తులను కరుణించి కాపాడాలని బిఆర్ఎస్ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం 125 గాజులరామారం డివిజన్ చిత్తారమ్మదేవి జాతర కార్యక్రమానికి కెపి.వివేకానంద్ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ చింతలను తీర్చే చిత్తారమ్మ తల్లి భక్తులందరి కరుణించి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాచకొండ బాల్‌రాజ్, కమిటీ సభ్యులు నర్సింహ, శంకర్‌రెడ్డి, వంశీ గౌడ్, కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, సురేష్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, నిజాంపేట్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్, మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవియాదవ్, పాక్స్ డైరెక్టర్ పరుష శ్రీనివాస్‌యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్‌యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్‌రాంరెడ్డి, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, బిఆర్ఎస్ నాయకులు అంజన్‌గౌడ్, కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, సుంకరి చందు, గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

**పార్క్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే...**

**జీడిమెట్ల, జనవరి 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలో గాజులరామారం డివిజన్ బాలాజీ లేఔట్ పార్క్‌ను కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా పాల్గొని, కుత్బుల్లాపూర్ కార్పొరేటర్లు రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, కొలుకుల జగన్, సురేష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో అంజన్‌గౌడ్, కస్తూరి బాలరాజ్, విజయరామరెడ్డి, పరుష శ్రీనివాస్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ సాయి, విశ్వనాథ్, అర్జున్‌రావు, చందు, అనూప్, నారాయణ చౌదరి, దూలప్ప, మురళీకృష్ణ, తౌర్య, జనీద్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా చిత్తారమ్మ దేవి జాతర వేడుకలు


చిత్తరమ్మ తల్లిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, జనవరి 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజులరామారం చిత్తరమ్మదేవి జాతర వేడుకలు ఆదివారం వైభంగా నిర్వహించారు. వేడుకల్లో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నేత కూన శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. అదేవిధంగా పోలీసు, మున్సిపల్ అధికారులు చేసిన ఏర్పాట్లను పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ వారు కూన శ్రీశైలంగౌడ్‌ని శాలువాతో సత్కరించి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. కాగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు చెల్లిస్తున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్యగౌడ్, సలహాదారు కూన శ్రీనివాస్ గౌడ్, ఇతర సభ్యులు బాలరాజు, నరసింహ, ఇంద్రసేన గుప్తా, బుచ్చిరెడ్డి, పెంటరెడ్డి, గౌరిశెట్టి శివ, సత్తయ్య ఇంద్రసేనారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలి

**సైఫాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్‌లలో నివసిస్తున్న పేదల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిగ్నిటి హౌసింగ్ కాలనీ టూ బీహెచ్ జెఏసి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కనీస సౌకర్యాలు, ఏఎంసి సదుపాయం కల్పించాలని జెఏసి రాష్ట్ర అధ్యక్షుడు శైలేష్‌సందీప్‌రాజ్ కోరారు. బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఏసి ప్రతినిధులు విజయ్ బండారి, శివ, జైపాల్, శ్రీనివాసాచారితో కలిసి ఆయన మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్‌లకు పగుళ్ళు, మురికినీరు, తాగునీరు, లిఫ్ట్ తదితర ఎన్నో సమస్యలతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై జిహెచ్ఎంసి, వివిధ శాఖల అధికారులకు అనేక సార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కారించాలని వారు డిమాండ్ చేశారు.

## మూసాపేటలో ఉచిత వైద్య శిబిరం

**మూసాపేట్, జనవరి 25, ప్రభాతవార్త :** మూసాపేటలో అంబటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాగా ఈ శిబిరానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావడంతో మంచి స్పందన లభించింది. శిబిరంలో ప్రజలు బీపీ, షుగర్, కంటి పరీక్షలు, ఈసీజీ వంటి వైద్య పరీక్షలు చేయించుకుంటూ, ఉచిత మందులు పొందుతున్నారు. ఈ శిబిరానికి ఆమోర్ హాస్పిటల్, ఆర్వ హాస్పిటల్‌కు చెందిన వైద్య బృందాలు హాజరై వైద్యసేవలు అందిస్తున్నాయి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పోలీసులకు ప్రజలు సహకరించాలి: సిఐ

**జియాగూడ, జనవరి 25 ప్రభాతవార్త:** శాంతిభద్రతలను కాపాడేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాములు అన్నారు. గతంలో ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన సునీల్‌పై అవినీతి ఆరోపణలు రావడంతో రెండు నెలల క్రితం నగర పోలీసు కమిషనర్ సజ్జన్నార్ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేష్ అదనపు భాధ్యతలు చేపట్టారు. ఇటీవల సజ్జన్నార్ నగరంలోని భారీస్థాయిలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేసిన విషయం తెలిసిందే. అందులో భాగంగా నల్లకుంట డిఐగా కొనసాగుతున్న రాములును కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. కుల్సుంపురా ఇన్‌స్పెక్టర్‌గా రాములు పదవి భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల్సుంపురా పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతలను కాపాడేందుకుగాను పోలీసులు ముందు ఉంటారన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రస్తకేలేదన్నారు. ముఖ్యంగా రౌడీషీటర్‌లపై ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఇన్‌స్పెక్టర్ రాములు హెచ్చరించారు.

## సినీ కార్మికుల సమస్యల పరిష్కరానికి కృషి : ఎమ్మెల్యే

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త :** సినీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వల్లాల నవీన్‌యాదవ్ అన్నారు. తెలం గాణ మూవీ టీవీ డిజిటల్ ఆర్టిస్ట్ యూనియన్ సర్వసభ్య సమావేశం మోతి నగర్ కమ్యూనిటీ హాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సమావే శానికి ముఖ్యఅతిథులుగా జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్, రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నవీన్‌యాదవ్ మాట్లాడుతూ, యూనియన్‌కు చెందిన కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను విని, వారి అభివృద్ధికి అన్నివిధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. యూనియన్‌కు సొంత స్థలం కేటాయించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని, భవన విరాళం అందిస్తానని సభాముఖంగా ప్రకటించారు. రహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి మాట్లాడుతూ, యూనియన్‌కు సొంత స్థలం కేటాయింపునకు సంబంధించి కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఈ అంశంపై సర్వే కూడా నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి నూకరాజు, ఆల్ కమిటీ చైర్మన్ నందూరి రాము, ఎస్ఆర్ఎస్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రాథోడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కేపీ రెడ్డి, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్‌తోపాటు ఈసీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డికి అంతిమ వీడ్కోలు

**సైదాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:**

అనారోగ్యంతో శనివారం సాయంత్రం మృతి చెందిన చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అంత్యక్రియలు ఆదివారం భూపేష్ గుప్తానగర్‌లోని శ్మశానవాటికలో జరిగాయి. శనివారం సాయంత్రం నానక్‌రాంగూడలోని ప్రైవేటు ఆసుపత్రిలో ఆయన మృతి చెందిన విషయం విదితమే. ఆదివారం కర్మన్‌ఘాట్‌లోని వంగ మధు స్వగృహానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్‌రావు, టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మితో పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, నియోజకర్గ నేతలు చేరుకుని మధు భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. దివంగత వంగ మధుసూదన్‌రెడ్డితో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.


మధు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


మధు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న రాంచందర్‌రావు




ఎమ్మెల్యే శ్రీగణేష్ దీక్షకు సంఘీభావం తెలుపుతున్న గీతారెడ్డి

## కొనసాగుతున్న ఎమ్మెల్యే రిలే దీక్షలు

**కంటోన్మెంట్, జనవరి 25 (ప్రభాతవార్త):** కంటోన్మెంట్ బోర్డు ప్రజల పట్ల కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షకు వ్యతిరేకంగా కంటోన్మెంట్‌ను విలీనం పోరాటం మరో స్వాతంత్ర్యం పోరాటమని మాజీ మంత్రి జె.గీతా రెడ్డి, ఎమ్మెల్యే అద్దంకి దయాకర్, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్, స్పోర్ట్స్ చైర్మన్ శివసేనరెడ్డి తెలిపారు. ఆదివారం కార్ఖాన లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపట్టిన రిలే నిరాహార దీక్ష 6వ రోజుకు చేరింది. ఆయనకు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి న్యాయమైన పోరాటానికి సంఘీ భావం తెలిపారు. కంటోన్మెంట్ బోర్డులో నామినేటెడ్ వ్యవస్థ ద్వార రాచరిక పెత్తనానికి స్వస్తి చెప్పాలని కంటోన్మెంట్‌ను గ్రేటర్‌లో విలీనం అయ్యేంత వరకు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, వికాస్ మంచ్ ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్, సామల రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అద్భుతంగా సాగిన భజనలు, భక్తి గీతాలు

**చిక్కడపల్లి, జనవరి 25 (ప్రభాతవార్త) :** వైష్ణవి ఆర్ట్ క్రియేషన్స్ ఆధ్వ ర్యంలో భక్త బృంద భజనలు, భక్తి గీతాలు, కవితా రవళి కార్యక్రమం ఆది వారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదికలో నిర్వాహకురాలు కళా విజయలక్ష్మి పని రాజు నిర్వహణలో జరిగింది. ముఖ్యఅతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్టర్ ఆచార్య టి.గౌరీశంకర్ హాజరై అద్భుతంగా నృత్య ప్రదర్శన నిర్వహించిన కళాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కవయిత్రి సుమిత్ర, ప్రముఖ గాయకులు ఉదయ్ కుమార్, చింతలపాటి మూర్తి, అద్దేపల్లి రాధాకృష్ణ, చివలూరి సంయుక్త, శుభా, నృత్య గురువు పిన్న జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళా సురేష్ ఆధ్వర్యంలో భజనావళి, కళావైష్ణవి, పులగం హర్షితశ్రీ, పుల గం కుందనశ్రీచే కూచిపూడి నృత్యప్రదర్శన జరిగింది. కళా వైష్ణవి ప్రదర్శిం చిన కూచిపూడి నృత్యం అద్భుతంగా ప్రదర్శించారు.

## '27న ప్రతిభా పురస్కారం, జీవిత సాఫల్య సత్కారం'

**చిక్కడపల్లి, జనవరి 25 (ప్రభాతవార్త) :** యువ విద్యార్థి నాయకుడు, తెలంగాణ అభిమాని ఫణి భార్గవ్ యాదిలో కార్యక్రమంలో భాగంగా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం 27న ప్రతిభా పురస్కారం, జీవిత సాఫల్య సత్కారం కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు కళానిలయం సంస్థ ప్రధాన కార్యదర్శి సురేందర్ తెలిపారు. చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళావేదికలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ పూర్వసలహాదారు డాక్టర్ కె.వి. రమణా చారి హాజరై జీవిత సాఫల్య పురస్కారాన్ని సిపిఎం సీనియర్ నాయకుడు, శతవసంతాలు పూర్తి చేసుకున్న అన్నె అచ్యుతరామయ్యకు ప్రధానం చేస్తున్నామని, ప్రతిభ పురస్కారాలను పాత్రికేయులు దీప్తి వాజ్‌పేయి, ప్రవీణ్ కాలవలకు అందిస్తున్నామని, విద్యార్థినిలు ఎం.రాజేశ్వరి, పి.రక్షిత లకు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ భాషాసాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, గానసభ అధ్యక్షుడు కళా వి.ఎస్. జనార్దన మూర్తి, రసమయి సంస్థ అధినేత డాక్టర్ ఎం.కె.రాము, నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు తదితరులు పాల్గొంటారు.

## ఎర్ర సింధూరం యాడ బాయ తల్లి సాంఘీక నాటకంపై సమీక్ష

**చిక్కడపల్లి, జనవరి 25(ప్రభాతవార్త):** గ్రామీణ ప్రాంతాల్లో పెత్తందా రులు బడుగు వర్గాల ప్రజల మధ్య సాంఘిక ఆర్థిక వ్యత్యాసాలకు దృశ్య రూపం ఎర్ర సింధూరం యాడబాయ తల్లి సాంఘీక నాటకం అని ప్రముఖ సాహితీ వేత్తలు పేర్కొన్నారు. ఆదివారం అల్ ది ఆర్టిస్ట్స్ ఆడిటోరియంలో మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహణలో ప్రముఖ రచయిత విడి రాజ గోపాల్ రచించిన ఎర్ర సింధూరం యాడ బాయ తల్లి సాంఘీక నాటకం సమీక్ష సమావేశం జరిగింది. ప్రముఖ కవి సాహిత్య విమర్శకుడు రామకృష్ణ చంద్ర మోళి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవితా లకు వాస్తవ దృశ్యం ఎర్ర సింధూరం నాటకం అన్నారు. నాటకంలో కొన్ని మార్పులు చేయాలని సూచించారు. సమీక్ష సమావేశంకు అధ్యక్షత వహిం చిన రాజ గోపాల్ మాట్లాడుతూ పక్తలు చెప్పిన సూచనలు పరిశీలించి మార్పులు చేయాల్సిన అవసరం ఉన్న చోట చేస్తానని తెలిపారు. కార్య క్రమంలో కళ పత్రిక సంపాదకుడు రఫీ, షార్ట్ ఫిల్మ్ నిర్మాత వెంకట స్వామి నాయుడు, ప్రముఖ నాటక దర్శకుడు డాక్టర్ వేము వందనం, గాయకుడు శరత్ చంద్ర, వ్యాఖ్యాతి ఆశా లత, వైద్యులు శాంతీ శ్రీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటకంలో ప్రధాన పాత్రధారిణి సురభి ప్రియాంకను సత్కరించారు. తొలుత సంక్రాంతి పండుగ పురస్కరించుకుని రవీంద్ర బాబు అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది.

## సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలి

**నేరేడ్‌మెట్, జనవరి 25 ప్రభాతవార్త:** సైనిక్‌పురిలోని డిఫెన్స్ కాలనీలో ఉన్న సెయింట్ సెబాస్టియన్ చర్చిలో క్రిస్మస్ విందు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి టీపీసీసీ జనరల్ సెక్రెటరీ సంజీవ్ ముఖ్య అతిథిగా హాజరై క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడుతూ, శాంతి, ప్రేమ, సేవ అనే విలువలే సమాజాన్ని ముందుకు నడిపిస్తాయని, పండుగలు ప్రజలను దగ్గరచేసే వేదికలుగా మారాలన్నారు. ప్రతి పౌరుడి సంక్షేమమే ప్రభుత్వాల లక్ష్యంగా ఉండాలని, అన్ని వర్గాల అభివృద్ధికి రాజకీయ నాయకులు బాధ్యతగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ వన్ కార్పొరేటర్ స్వర్ణ రాజ్, మాజీ కౌన్సిలర్ ఇంద్రప్రియదర్శని, ఎజెకిల్ బిరుదుగడ్డ, మల్కాజ్ గిరి బీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బీకే శ్రీనివాస్, నాయకుడు కపిల్, ప్రవీణ్ జన్సన్, చర్చి కౌన్సిల్ సభ్యుడు వినోద్ కుమార్ తదితరులు పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అతిథులు ఇచ్చిన సందేశాలతో కార్యక్రమం ఆధ్యాత్మికతతో పాటు సామాజిక ఐక్యతను ప్రతిబింబిస్తూ విజయవంతంగా ముగిసింది.

## ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ

**నేరేడ్ మెట్, జనవరి 25 ప్రభాతవార్త :** జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని మల్కాజిగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల నుంచి నేరేడ్మెట్ ఎక్స్ రోడ్డు వరకు సాగిన ఈ ర్యాలీలో అధ్యాపకులతో కలిసి 1,100 మంది విద్యార్థులు పాల్గొని వోట్ ఈజ్ మై వాయిస్, వోట్ ఈజ్ మై రైట్, వోట్ ఫర్ ష్యూర్ అనే నినాదాలతో రహదారులను మారుమోగించారు. ఈ సంద ర్భంగా ప్రిన్సిపల్ ఉమాదేవి మాట్లాడుతూ ఓటుతోనే ప్రజాస్వామ్యం నిల బడుతుందని, ప్రతి పౌరుడు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ జి. రాజమోళి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకుని ఎన్నికల్లో పాల్గొనాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యా పకులు విద్యాసాగర్‌రెడ్డి, డాక్టర్ గోపీ ప్రజాస్వామ్య విలువలపై విద్యార్థు లకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పేరెంట్–టీచర్ సమావేశంలో ఇంటర్ బోర్డు ప్రత్యేక అధికారి డాక్టర్ జోష్నా మాట్లాడుతూ విద్యార్థులు ఆసక్తితో చదివి తమ కలలతో పాటు తల్లిదండ్రుల ఆశయాలను సాకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సూర్యనారాయణునికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**మల్కాజ్‌గిరి, జనవరి 25 ప్రభాతవార్త :**

రథసప్తమిని పురస్కరించుకుని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ఆయన సతీమణి మమత రథసప్తమి వేడుకల్లో పాల్గొని శ్రీ సూర్య నారాయణ భగవంతుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదిత్యునికి అభిషేకాలు, అర్చనలు చేసి ప్రజల శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రథసప్తమి రోజున సూర్యారాధన చేయడం ద్వారా ఆరోగ్యం, శాంతి, సమృద్ధి లభిస్తాయని అన్నారు. ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షిస్తూ స్వామివారి వద్ద ప్రార్థించినట్లు తెలిపారు. సంప్రదాయాలు, ఆచారాలు, ఆధ్యాత్మిక విలువలను కాపాడుకోవడం సమాజానికి అత్యంత అవసరమని, ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాండు యాదవ్, టింకు గౌడ్, రాకేష్, ఆలయ నిర్వాహకులు రవిశంకర్‌తో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడగా, కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో శాంతియుతంగా, ఘనంగా సాగింది.

# అభిరుచి ఉన్న రంగాల్లోనే బాలలను ప్రోత్సహించాలి

### సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక

**హైదరాబాద్ జనవరి 25 (ప్రభాతవార్త):**

తల్లిదండ్రులు తమ పిల్లలను, వారి అభిరుచుల మేరకు ప్రోత్సహిస్తే వారు ఏ రంగాల్లోనైనా తప్పక రాణిస్తారని సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక అభిప్రాయ పడ్డారు. ఆదివారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విజయ్ ఆర్ట్స్ అకాడమీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి సమాచార మరియు పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక ముఖ్యఅతిథిగా హాజరై ఆమె చిన్నారులకు అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ దిశగా అడుగులు వేయాలని చిన్నారులకు పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, అంకితభావంతో ప్రయత్నిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చున్నారు. చిన్నారి బాల బాలికల్లో ద్విగుణీకృతమైన శక్తి ఉందని, దాన్ని వెలికితీసేందుకు కృషి చేయాలని, వారి ధోరణికి వ్యతిరేకరంగంలో ప్రోత్సహించరాదని తల్లిదండ్రులకు సూచించారు. పిల్లల్లో నానాటికి సృజనాత్మక శక్తి పెరుగుతుందని, దాన్ని వెలికితీసి దేశానికి ఆణిముత్యాల్లాంటి నిష్ణాతులను అందివ్వాలని విజయ్ కుమార్ ను ఆమె కోరారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ భీరప్ప మాట్లాడుతూ నాటి కాలంలో టీవీలు మాత్రమే ఉండేవని, ప్రస్తుత కాలం సెల్‌ఫోన్ల కాలం, పిల్లాడు బడి నుండి రాగానే ఒక గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని ఫోన్‌తో ఆడుకోవడం వారి ప్రపంచంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ద్వారా పిల్లలు చెడిపోతున్నారని, ఇలాంటి విషయాలపై సుదీర్ఘ చర్చ జరగాలన్నారు. అనునిత్యం సమస్యల వలయంలో చిక్కుకున్న మానవులకు మానసిక ప్రశాంతతను, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనని పేర్కొన్నారు. చిన్నారులు తమ అద్భుతమైన చిత్రలేఖనం ద్వారా సమాజహితానికి చైతన్యానికి పాటుపడాలని, అంతరించిపోతున్న కళలను వెలికి తీయడం, చిన్నారులను కళా ప్రవీణులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసిన విజయ్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విజయకుమార్ ను అభినందించారు. ప్రసిద్ధ గాయని సురేఖ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ అభిరుచుల మేరకు పిల్లల భవిష్యత్తును రూపొందించే ప్రయత్నం చేయడం కంటే వారికి ఏ రంగంలో అభిరుచి, ఆసక్తి ఉంటాయో ఆ మేరకే వారిని ప్రోత్సహిస్తే మంచిదన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాతీయ సంస్థ డైరెక్టర్ డా. శ్రీకాంత్ శర్మ మరియు మాజీ రిజిస్ట్రార్ జేఎన్‌టీయూ మంజూర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు. సభకు వాక్యతగా డాక్టర్ వరస పాల్గొన్నారు. పొలిటికల్ కార్టూనిస్టు డాక్టర్ విజయకుమార్ సభకు అధ్యక్షత వహించారు. ఈ సంవత్సరం 15 వేల మందికి పైగా విద్యార్థులు కార్టూన్, పెయింటింగ్, వ్యాసరచన పోటీల్లో పాల్గొనగా, 300 మందికి పైగా విద్యార్థిని విద్యార్థులు బహుమతులు గెలుపొందారు.

### మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని

## పునరుద్ధరించాలి: శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, జనవరి 25 ప్రభాతవార్త :** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలని మహిళా కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం అంబర్‌పేట భరత్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి అఖిల భారత మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కుమారి మయూరిసింగ్ మాట్లాడారు. విబిజి రామ్‌జీ చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సునీతా రావు మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం ఎలా నిర్వీ ర్యం చేస్తుందో వివరించారు. ఈ చట్టంలో మహిళా కార్మికులు ఎక్కువగా లబ్ది పొందుతున్నారని వారు అన్నారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టారని తెలియజేశారు. ఈ చట్టం పైన బిజెపి ప్రభుత్వం చేసే కుట్రపూరిత చర్యలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం కుమారి మయూరిసింగ్, సునీత రావులతో కలిసి బతుకమ్మకుంటలోని రోజువారి కూలీలను కలిసి, వారికిఈ చట్టాన్ని వారి హక్కులను గురించి వివరించారు. కార్యక్రమంలో స్టేట్ జనరల్ సెక్రెటరి వెంకటసుబ్బమ్మతో పాటు జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, డివిజన్ల అధ్యక్షులు, బ్లాక్ ప్రెసిడెంట్‌లు, బూతు స్థాయి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బంజారాహిల్స్‌లో సైబర్ అవగాహన కార్యక్రమం

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త :** బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రోడ్ నం.10లో ఉన్న సేవాలాల్ భవన్‌లో సైబర్ అవగాహన కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్. సుహాసన్, ఎస్సైలు సురేందర్, సంధ్యలతోపాటు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చెందిన సైబర్ వారియర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు పెరుగుతున్న సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆర్థిక, ఆర్థికేతర సైబర్ మోసాలు, ఓఎల్ఎక్స్ ద్వారా జరిగే మోసాలు, ఉద్యోగాల పేరుతో చేసేమోసాలు, పెట్టుబడుల పేరుతో మోసాలకు సంబంధించి జాగ్రత్తలు వివరించారు. అలాగే సైబర్ నేరాలకు గురైన బాధితులు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అనుమానాస్పద లింకులు, కాల్స్, సందేశాలకు స్పందించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. సైబర్ మోసాల నుంచి రక్షణపొందాలంటే అవగాహనతోపాటు తక్షణ చర్యలు అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని సుహాసన్ విజ్ఞప్తి చేశారు.

## 108 సార్లు సూర్య నమస్కారాలు

**పేట్‌బషీరాబాద్, జనవరి 25, ప్రభాతవార్త :**

సూర్య భగవానుడికి ఇష్టమైన ఆదివారం రథసప్తమి రావడం చాలా విశేషమని సీనియర్ యోగా గురువు రవీందర్ రాజు అన్నారు. సుచిత్రాలోని టిఎస్ఆర్ నార్త్ సిటీ మాల్ ఆవరణలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించ కొని శివోహం యోగ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో 300 మంది యోగ అభ్యాసకులచే 108 సార్లు సూర్య నమస్కారాలు చేశామని తదనంతరం సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రావు, నవీన్, లక్ష్మణ్, రాజు, ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

### బంగారం దుకాణంలో గోల్‌మాల్ కేసులో

## ముగ్గురు మహిళల అరెస్ట్

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త:** జూబ్లీహిల్స్‌లో ఆభరణాల దుకాణ దారుడిని టోకరా కొట్టించిన నకిలీ బంగారం అంటగట్టిన వెళ్లిన సంఘటనలో జూబ్లీహిల్స్ పోలీసులు ముగ్గురు తమిళనాడుకు చెందిన మహిళలను అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 36లోని ఎస్‌కేటీ జవెలర్స్‌కు వచ్చిన ముగ్గురు మహిళలు తమ వద్ద ఉన్న పాత బంగారు ఆభరణాలను దుకాణదారులకు ఇచ్చారు. వాటి స్థానంలో కొత్త నగలను తీసుకుంటామని చెప్పడంతో దుకాణదారులు నగలను పరీక్షించేందుకు తీసుకెళ్లారు. అసలు నగలని తేలిన తరువాత ఆయా నగలను మహిళలకు ఇచ్చారు. కాగా కొత్త నగలు తీసుకొనే సమయంలో మహిళలు ముందుగానే తమ వద్ద పెట్టుకొన్న నకిలీ నగల ప్యాకెట్‌ను దుకాణదారులను అంటగెట్టి అక్కడినుంచి జారుకున్నారు. ఈ సంఘటనలో దుకాణదారులు వచ్చిన మహిళ లకు దాదాపు 8.50 తులాల బంగారు ఆభరణాలు, రూ. 35 వేల నగదు ఇచ్చారు. జరిగిన మోసాన్ని గుర్తించిన దుకాణదారులు జూబ్లీహిల్స్ పోలీసు లకు ఫిర్యాదు చేయగా పోలీసులు దాదాపు వందుకుపైగా సీసీ టీవీ కెమెరా లను పరిశిలించారు. శంషాబాద్ ప్రాంతంలో ఒక గదిని అద్దెకు తీసుకొని నివసి స్తున్నట్లు గుర్తించారు. వారికోసం వలవేసి ముగ్గురు మహిళలను పట్టుకు న్నారు. పట్టుబడినవారిలో తమిళనాడుకు చెందిన బోయ రాధ(37), ధనరాము (29), వారికి సాయం చేసిన ఆలకుంట్ల నాగసూరి(36) ఉన్నారు. కాగా ఇక్కడి నుంచి కాజేసి తీసుకెళ్లిన నగలను మరో ప్రాంతంలో విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## అటల్ బిహారీ వాజ్‌పాయ్‌కి ఘన నివాళులు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 25 ప్రభావాతర్త :** భారతరత్న మాజీ ప్రధాని, భారతీయ జనతాపార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పాయ్ శత జయంతి వేడుకలు చింతల్ డివిజన్ భారతీయ జనతాపార్టీ నాయకులు కొట్టే రాజా సదానంద్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పార్టీనాయకులు, కార్యకర్త లతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పాయ్ దేశభక్తి, ప్రజాస్వామ్య విలువల పట్ల పూర్తి విశ్వాసం, సుసంపన్న భారతదేశ నిర్మాణంపట్ల చేసి సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు రాజేశ్‌చారి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ రాజాసదానంద్, జిల్లా కార్యవర్గ సభ్యులునల్ల మహిపాల్, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గంటలగిరి శంకర్ రాంసాయి యాదవ్, ప్రతాప్‌రెడ్డి, దుర్గారావు, వినయ్, వెంకటేశ్, శ్రీను, యాదిలాల్, మల్లేశ్, ప్రశాంత్, శేఖర్‌మామ, బిజెవైఎం నాయకులు మణి పాల్గొని వాజ్‌పాయ్ ఆశయసాధనకు కట్టుబడి వుంటామని ప్రతిజ్ఞ చేశారు.

## వెంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలు

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త:** శ్రీనగర్‌కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడు కల నేపథ్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాల నేపథ్యంలో అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు ఆలయ ఛైర్మన్ సిపిరి అర్జున్‌యాదవ్, ఆలయ ఈవో శ్రీనివాసశర్మ తెలిపారు.

## ఎంపి ఈటలను విమర్శించడం సరైంది కాదు : పరశరామ్

**కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ బోర్డును గ్రేటర్‌లో విలీనం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ చేపడుతున్న దీక్షలో ఎంపీ ఈటెల రాజేందర్‌పై అనుచి వాఖ్యలు చేయడం సరైంది కాదని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ.పరశరామ్ తెలిపారు. ఆదివారం 5వ వార్డు జ్యోతి కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన అంశాలను పట్టించుకోకుండా విలీన అంశంపై దీక్షలు చేస్తూ ఎంపీని విమర్శించడం తగదన్నారు. అన్ని సామాజిక దృక్పదం కలిగి ఉన్న ఎంపీ ఈటెలను విమర్శించడం సరైంది కాదన్నారు. దేశంలోని 56 కంటోన్మెంట్‌ల బోర్డుల అంశం టెక్నికల్ సమస్యలతో కొంత జాప్యం జరుగుతుందన్నారు. ఏది ఏమైనా గ్రేటర్‌లో జరుతుందన్నారు. అవసరమైతే బోర్డు ఎన్నికలు త్వరలో జరిగే అవకాశాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజ్ఞాశాలి అబ్దుల్ కలాం

**సైఫాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రముఖ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా, ఉపాధ్యాయునిగా అబ్దుల్ కలాం దేశానికి విశేషమైన సేవలు అందించారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం కావాలని టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఫిరోజ్‌ఖాన్ చెప్పారు. ఎపిజె అబ్దుల్ కలాం టాలెంట్స్ గణతంత్ర దినోత్సవాని న్ పురస్కరించుకుని ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన అవా ర్డుల ప్రదానోత్సవం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మిస్సైల్ మ్యాన్‌గా భారత సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప ప్రజ్ఞాశాలి కలాం అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో రూరల్ డెవలప్ మెంట్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు షిరెన్‌సుల్తానా తదితరులు పాల్గొన్నారు. ఫిరోజ్‌ఖాన్ పలువురు ప్రముఖులకు అవార్డులను ప్రదానం చేశా.

## హక్కుల పట్ల అందిరికి అవగాహన ఉండాలి

**సైఫాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** సమాజంలో ప్రతి పౌరుడు హక్కులపై అవగాహన కలిగి యుండాలని, ముఖ్యంగా మానవ హక్కులపైన కూడా ఉండాలని హైకోర్టు మాజీ న్యాయవాది జస్టిస్ బి.చంద్రకుమార్ సూచిం చారు. ఐఎన్‌హెచ్ఆర్‌పిసి రూపొందించిన నూతన సంవత్సరం క్యాలెం డర్‌ను ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించిన సందర్భంగా ఆయన ప్రసంగించారు. చట్టాలపై అవగాహన కలిగియుండటం వల్ల హక్కులను కాపాడుకోగలుగుతామని ఆయన చెప్పారు. ఐఎన్‌హెచ్ ఆర్‌పిసి తెలంగాణ రాష్ట్ర ఛైర్మన్ నవోదయ సిద్ధు మాట్లాడుతూ ప్రతి వ్యక్తి సమాజంలో గౌరవంగా జీవించాలంటే హక్కులు తెలుసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పుట్టా పద్మారావు, బిట్ల ప్రభాకర్, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలి : ఎమ్మెల్యే

**కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త:** ప్రజలు ఎల్లప్పుడు సుఖసంతోషాలతో ఉండాలని భగవంతున్ని వేడుకున్నట్లు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. రథ సప్తమిని పురస్కరించుకొని ఆదివారం మల్కాజిగిరిలోని సూర్య భగవన్ దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ మెంబర్ పాండు యాదవ్, బిఆర్ఎస్ నేత టింకూ గౌడ్‌లతో వేలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సూర్య భగవన్ స్వామి వారిని దర్శించుకున్నారు.

## జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌దే గెలుపు: ఎమ్మెల్యే



మాట్లాడుతున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** వచ్చే జిహెచ్ ఎంసి ఎన్నికల్లో అంబర్‌పేట నియోజక వర్గంలోని అన్ని డివిజన్లలో బిఆర్ఎస్ పార్టీ గెలుపు తథ్యమని అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని యువతి మండలి హాలులో ఆపార్టీ నాయకుడు డాక్టర్ బద్దుల ఓంప్రకాష్‌యాదవ్ అధ్యక్ష తన కాచిగూడ, బర్కత్‌పుర, గోల్నాక డివిజన్ల కార్య కర్తల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. సమా వేశంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో అంబర్‌పేటలో బిఆర్ఎస్‌కు బిజెపితో పోటీ ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ లెక్కలోకి రాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీ లను అమలు చేయడంలో పూర్తిగా విఫలమవడంతో బస్తీల్లో, కాలనీల్లో ప్రజలకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిట్టుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ డివిజన్ల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతే పార్టీ అభ్యర్థుల విషయమై చర్చించుకుందామని, అప్పటి వరకు పార్టీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. బూత్ స్థాయిలో పార్టీ కరెక్టుగా చేసుకుంటే గెలుపొందడం కష్టసాధ్యమేమి కాదని, ఆ దిశగా పార్టీ నేతలు పని చేయాలన్నారు. ప్రతి బూత్ ఓటర్ లిస్టులో 1000 ఓట్లు ఉంటే అందులో 750 మంది ఓటర్లు మాత్రమే స్థానికంగా ఉండి ఓటు వేసే అవకాశం ఉంటుందని, అందులో 50 మంది వరకు మాత్రమే ప్రతిపక్ష పార్టీ లకు చెందిన వారికి ఓటు వేస్తారని తెలిపారు. మిగతా 700 మంది ప్రజలకు ఏ పార్టీతో సంబందం లేకుండా ఉంటారని, అలాంటి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తూ వారికి అండగా ఉం డాలని అప్పుడే గెలుపు సాధ్యమవుతుందన్నారు. తాను ఇప్పటివరకు ఎవరికి టికెట్‌ఇస్తామని హామీ ఇవ్వలేదని, అందరూ కలిసి కట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థిని గెలి పించాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే కార్య కర్తలు అన్యాయం జరగనివ్వమని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు డాక్టర్ బద్దుల శిరీష ఓంప్రకాష్ యాదవ్, రవీందర్‌యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాజ్జీ, ఎర్ర భీష్మ బుచ్చిరెడ్డి, ఎస్.శాంతి, కాలేరు భరత్, కాలేరు రాజు, కాలేరు భరత్, ఎస్. శ్రీశైలం, పెంట రమేష్, ఆర్.కె.బాబు, నర్సింహారెడ్డి, స్వర్గీయ లింగంగౌడ్ కుమారుడు సాయిరామ్‌గౌడ్ తదితరులు పాల్గొని మాట్లాడారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

## లక్ష్యసాధనలో స్థిరత్వం అవసరం

### రాష్ట్ర గవర్నర్ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్

**చిక్కడపల్లి, జనవరి 25(ప్రభాతవార్త) :** ప్రతికూల పరిస్థితులను అడ్డంకు లుగా కాకుండా, మనల్ని మరింత బలంగా తయారు చేసే అవకాశాలుగా చూడాలని రాష్ట్ర గవర్నర్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్ అన్నారు. ఆది వారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కళాశాలలో కెరీర్ ఆశ యాలు, ప్రేరణ" అనే అంశంపై సెమినార్ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజ రైన దాన కిషోర్ మాట్లాడుతూ తన జీవిత ప్రయాణం, విజయానికి దారి తీసే మార్గంలో ఎదురయ్యే సవాళ్లు, కష్టాలను విద్యార్థులతో పంచుకు న్నారు. ప్రతికూల పరిస్థితులను అడ్డంకులుగా కాకుండా, మనల్ని మరింత బలంగా తయారు చేసే అవకాశాలుగా చూడాలని ఆయన సూచించారు. "ప్రేరణ అనేది తాత్కాలిక భావం కాదు, అది ఒక అలవాటు" అని పేర్కొంటూ, లక్ష్య సాధనలో స్థిరత్వం ఎంతో అవసరమని విద్యార్థులకు సూచించారు. విద్యాసంస్థల కరస్పాండెంట్ డా. జి. సరోజా వివేకానంద, విద్యాసంస్థల సిఈఓ ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ముగ్ధమనోహరం హర్షిత భరతనాట్య అరంగేట్రం

**రవీంద్రభారతి, జనవరి 25 ప్రభాతవార్త :** ప్రముఖ నాట్యగురువు, శ్రీరామ నాటక నికేతన్ వ్యవస్థాపకురాలు మంజుల రామస్వామి శిష్యు రాలు హర్షిత భరతనాట్య ఆరంగేట్రం రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ముగ్ధమనోహరంగా జరిగింది. చిన్నవయస్సులోనే భారతీయ శాస్త్రీయ కళలపట్ల అభిరుచితో గురువు వద్ద శిక్షణపొంది నాట్యకళారంగంలో అద్భుతంగా రాణిస్తున్న హర్షిత భరతనాట్య ఆరంగేట్రంను పుష్పాంజలితో ప్రారంభించి గణేశస్తుతి, ఆలరిప్పు, పదవర్ణం, హనుమాన్ చాలీసా, బ్రహ్మ మొక్కటే, తిల్లానా తదితర అంశాలను అత్యంత అద్భుతంగా ప్రదర్శించి తన ప్రతిభను చాటుకుంది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏపి హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ గ్రంథిభవానీ, విశిష్ట అతిథులు డా. శోభారాజు, డా. జె.అనురాధ, డా. కె.రామాచారిలతో కలిసి జ్యోతి ప్రకాస నం చేసి కళాకారిణి హర్షిణిని ఘనంగా సన్మానించి శుభాశీస్సులందజేశారు.

## వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఘనంగా రథసప్తమి

**నేరేడ్‌మెట్, జనవరి 25 ప్రభాతవార్త :**

వినోభా నగర్‌లోని శ్రీశ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో రథసప్తమి సందర్భంగా శ్రీ సూర్యనారాయణ స్వామికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, అర్చనలు, ఆదిత్య హృదయ పారాయణం నిర్వహించడంతో పాటు పాలుపోసే కార్యక్రమాన్ని చేపట్టారు. పండితులు రథసప్తమి విశిష్టతను వివరిస్తూ, ఆదివారం సూర్యా రాధన చేయడం ద్వారా ఆరో గ్యం, దీర్ఘాయుష్షు, ఐశ్వర్యం కలుగుతాయని భక్తులకు వివరించారు. రథ సప్తమి రోజున సూర్యుని ఆరాధించడం వలన పాపక్షయం కలిగి, సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులతో కిటకిటలాడి, భక్తివాతావరణం నెలకొంది. పుర ప్రముఖులు, ఆలయ కమిటీ సభ్యులు, జీవితకాల సభ్యులు, దాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలు ప్రశాంతం గా, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం

### ఎమ్మెల్యే వివేకానంద్

**దుండిగల్, జనవరి 25, ప్రభాతవార్త :**

క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. ఆదివారం దుండిగల్ సర్కిల్ దుండిగల్‌లో నిర్వహించిన "దుండిగల్ ప్రీమియర్ లీగ్" కార్యక్రమానికి బిఆర్ఎస్ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథి గా హాజరై లీగ్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రీడల పట్ల ఆసక్తి చూపి దృఢంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ శంభీపూర్ కృష్ణ, జిల్లా ఫిషరీస్ కోఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, మేడ్చల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, జక్కుల కృష్ణ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గోపాల్ రెడ్డి, జక్కుల శ్రీనివాస్ యాదవ్, కొల్తూరు మల్లేష్, పాక్స్ ఎక్స్ వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, నాయకులు కమ్మరి వీరేష్, నర్సింగ్ గౌడ్, ధారా మహేష్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I, MADHURA RAGHOTAMPURAM R/o. H.No.2-1-420, Shreesha Apts, F.No. 103, St.No.4, Nallakunta, Hyd-44, Changed My Name As "MADHURA PATIL" D/o. ANANTH RAO PATIL. for future record purpose.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

**IN THE COURT OF THE HON'BLE V SR. CIVIL JUDGE: CITY CIVIL COURT : AT HYDERABAD.**
**E.P.No 246 OF 2020**
**in**
**ABR/CF/No. 478 OF 2017**

BETWEEN:-
**M/s Margadarsi Chit Fund Pvt Ltd,** Secunderabad Branch
...Decree Holder
AND
**Mrs. K. Rajya Lakshmi & Others.,**
...Judgment Debtors

To
**Mr. Ramsety Vinaye Kumar,** S/o. Rama Nagulu, Occ: Prop. (Saree Cloth Showroom) R/o. Flat No.4-B, IV Floor, "V.R. Residency" East Prashanth Nagar, Teegalaguda, Moosarambagh, Hyderabad.
...JD.No. 5.

Please take Sale Notice that the above E.P. is is filed against for recovery of **Rs.15,73,020/-** (Rupees Fifteen Lakhs Seventy Three Thousand Twenty Only) and the same posted to: **24.02.2026** for your appearance in the court at **10.30 a.m.** If you fail to attend the court on that day the matter will be heard and decided exparty.

// BY ORDER OF THE COURT //
**Sd/- R. CHAKRADHAR**
**ADVOCATE FOR DHR**
H.No.6-1-295/1, PADMA RAO NAGAR, SECUNDERABAD.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, HYDERABAD-SOUTH, AT: ERRAGADDA.**
**A.B.R.C.F.No.108 OF 2025**
**M/S. BABA CHAURANGINATH CHIT FUND (P) LTD.**
...DISPUTANT
VS.
**M/s. BHOOMINANDAN TEXTILE and others** ...OPPONENTS

To,
**1. Sri. Ravinder Kumar Agarwal** S/o. Late Bajrang Lal Agarwal, Aged about: 58, Occ: Business, R/o. 4-9-54, Plot No. 65, Mushk Mahal, Huda Colony, Bhagat Singh Statue, Attapur, K.V.RangaReddy, T.S., 500048,
**2. M/s Telangana Sarees** represented by Sri. Jamal Nabi zada S/o. Sri. Mirza Abbas Nabi Zada, Aged about: 33 years, Occ: Business, R/o. 22-2-761, Flat No.103, Agha Castle, Noor Khan Bazar, Hyderabad - 500024,
**3. M/s Guru Dev Enterprise** represented by Sri. Vinod Kumar Jain Munot S/o. Late Karanidan, Aged about: 60 years, Occ: Business, R/o. 4-3-415/4, Sultan Bazar, Kanda Swamy Lane, Hyderabad-500001
....Opponents 2 to 4

Please take notice that the above dispute is filed Disputant against you and other for recovery of **Rs.11,37,550/- (Rupees Eleven Lakhs Thirty Seven Thousand Five Hundred Fifty Only)** together with interest at 18% p.a. from the date of the Dispute till the date of Realization on principle amount and the same is posted to dated: **3-2-2026,** for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator, Hyderabad-South, 8-3-166/5/2, 2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 3.00 PM if you fail to attend the said office on that day the case will be heard and decided exparte.

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR
**M/S. BABA CHAURANGINATH CHIT FUND PRIVATE LIMITED**
**Foreman/Managing Director**
*21-7-721, Flat No: 304, M.B. Towers, Ghansi Bazar, Hyderabad.
**Cell: 9177156038**

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATIOR, HYDERABAD-SOUTH, AT: ERRAGADDA.**
**A.B.R.C.F.No.109 OF 2025**
**M/S. BABA CHAURANGINATH CHIT FUND (P) LTD.**
...DISPUTANT
VS.
**M/s. B. R Textile Agencies and others** ...OPPONENTS

To,
**1. Smt. Prerna Agarwal** W/o. Sri Rahul kumar Agarval, Aged about: 36, Occ: Housewife,
**2. Sri. Rohit Kumar Agarwal** S/o. Sri. Ravinder Kumar, Aged about: 34 years, Occ: Business,
**3. Smt. Shiksha Agarwal** W/o. Sri. Rohit Kumar Agarwal, Aged about: 31 years, Occ: Housewife,
Parties No.1 to 3 R/o. 4-9-54, Plot No. 65, Mushk Mahal, Huda Colony, Bhagat Singh Statue, Attapur, K.V. Ranga Reddy, T.S., 500048. ....Opponents 2 to 4

Please take notice that the above dispute is filed Disputant against you and other for recovery of **Rs.11,37,550/- (Rupees Eleven Lakhs Thirty Seven Thousand Five Hundred Fifty Only)** together with interest at 18% p.a. from the date of the Dispute till the date of Realization on principle amount and the same is posted to dated: **3-2-2026,** for your appearance before the office of Deputy Registrar of Chits/Arbitrator, Hyderabad-South, 8-3-166/5/2, 2nd Floor, Nayeem Estate, Adj to Bata Show Room, Erragadda, Hyderabad, at 3.00 PM if you fail to attend the said office on that day the case will be heard and decided exparte.

BY ORDER OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR
**M/S. BABA CHAURANGINATH CHIT FUND PRIVATE LIMITED**
**Foreman/Managing Director**
*21-7-721, Flat No.304, M.B. Towers, Ghansi Bazar, Hyderabad.
**Cell: 9177156038**



మున్నూరు కాపు డైరీని ఆవిష్కరిస్తున్న దానం నాగేందర్ తదితరులు

## రాజ్యాధికారం కోసం బహుజనులు ఉద్యమించాలి

### ఎమ్మెల్యే దానం నాగేందర్

**కంటోన్మెంట్, జనవరి 25 ప్రభాతవార్త:** బహుజనుల రాజ్యాధికారం కోసం కలిసి కట్టుగా ఉద్యమిస్తేనే బిసీలకు రాజ్యాధికారం వస్తుందని, అందు వల్ల బిసీలంతా కలిసి కట్టుగా ఉద్యమించాలని, మున్నూరు కాపుల అభ్యున్నతికి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తుందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీలు కె.కేశవరావ్, వి.హన్మంత్ రావ్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం సికింద్రాబాద్ రాజరాజేశ్వరి గార్డెన్‌లో నిర్వహించిన మున్నూరు కాపు సర్పంచ్‌ల సన్మాన సభకు వారు ముఖ్య అతిథిలుగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మున్నూను కాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావ్, డైరీ కమిటీ చైర్మన్ మంగళారపు లక్ష్మణ్, తెలంగాణ జర్నలిస్ట్ సంఘం నేతలు అల్లం భాస్కర్,మిద్దెల జితేందర్, ఆచారి రమేశ్, సత్తు మల్లేశ్ పాల్గొన్నారు.

### ఘనంగా క్రీడా పోటీలు

**అడ్డగుట్ట, జనవరి 25 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయని బిల్లాబాంగ్ స్కూల్స్‌చైర్మన్ అండ్ డైరెక్టర్ మహేశ్వర్‌రెడ్డి సునీతా రాణి తెలిపారు. వెస్ట్ మారేడ్‌పల్లి షెనాయ్ ప్లే గ్రౌండ్‌లో నిర్వహించిన సైనిక్ పురి సాకేత్‌కు చెందిన ఫాస్టర్ బిల్లాబాంగ్ హైస్కూల్, హిమయత్‌నగర్, కాంగ్రు కిట్స్ స్కూల్స్ క్రీడా వార్షికోత్సవ వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, తల్లిదండ్రులకు,పరుగు పందెం, యోగా, డ్రిల్ వంటి వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు మెడల్స్,బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అపర్ణ జ్యోతి, బిజినెస్ డెవలప్‌మెంట్ హెడ్ నితిక పాల్గొన్నారు.

### రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో మెగా హెల్త్ క్యాంప్

**నిజాంపేట్, జనవరి 25, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బాచుపల్లి పరిధిలోని రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, వేల్యూ మెడ్ హాస్పిటల్ వారి సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై క్యాంపును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యం ఎంతో ముఖ్యమని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలు మంచి వైద్య సేవలు పొందేలా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇటువంటి సేవా కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొలన్ జీవన్ రెడ్డి, ఆలేటి శ్రీనివాస్, సిద్దనోల సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, సంఘ అధ్యక్షులు నవీన్, సురేష్, విద్య సాగర్, శ్రవణ్, ఫణింద్ర, వినయ్, రవీందర్, కిరణ్, వైద్యులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రోగి సహాయకులకు అన్నదానం

**సికింద్రాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి ఆధ్వర్యంలో సికింద్రాబాద్ గాంధీ, బంజారాహిల్స్ బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ ఆస్పత్రుల ప్రాంగణాల్లో సుమారు 300 మంది రోగి సహాయకులకు ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నార్తులు, అభాగ్యులు, నిరుపేద రోగి సహాయకులు అన్నదానం చేయడం తమవంతు కర్తవ్యమని, దశాబ్దకాలంగా అనేక సామాజిక, ఆధ్యాత్మిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. నగరంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులవద్ద అన్నదాక కార్యక్రమాలు చేపట్టామన్నారు. జీడిమెట్ల, దూలపల్లిలకు చెందిన వేణుస్ ఎంటర్ ప్రైజెస్, భవానీ గాల్వనైజింగ్ సంస్థల అధినేతలు వేణుగోపాల్ గురుస్వామి, శ్రీనివాస్‌లు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో చింతల్ అయ్యప్ప ధర్మశాస్త్ర సేవ సమితి అధ్యక్షులు వెంకటేష్ (బొంబాయి గురుస్వామి), ప్రధాన కార్యదర్శి పుల్లారావు, కోశాధికారి కేవీ రాజేంద్ర ప్రసాదరావు, సంయుక్త కార్యదర్శి సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక అధ్యక్షులు కృష్ణమూర్తి, సభ్యులు విశ్వనాథం, తిరుపతి, హరిప్రసాద్, యాదగిరి, కనకదుర్గా, చందు, మని, నాగయశశ్వీ, కేసన,చంద్రశేఖర్‌లు పాల్గొన్నారు.

### పరీక్షా కేంద్రాన్ని తరలిస్తాం: ఎమ్మెల్యే

**అల్వాల్, జనవరి 25 ప్రభాతవార్త:** ఓల్డ్అల్వాల్‌లోని లయోలా కళాశాల మార్గంలో ఉన్న టిసిఎస్ ఐఆన్ పరీక్షా కేంద్రాన్ని తరలించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆదివారం ఆందోళనకు దిగారు. ప్రజలకు మద్దతుగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, కార్పొరేటర్ శాంతి శీనివాస్ రెడ్డిలు వారితో జత కలవడం జరిగింది. పరీక్షా కేంద్రం వద్ద నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు పట్టి పీడిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షలు జరిగే రోజు మొబైల్ సిగ్నల్ జామింగ్ జరుగుతోందన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మొబైల్ ఫోన్‌లు పని చేయడం తెలిపారు. ప్రజా ఇబ్బందులు దృష్ట్యా సెంటర్‌ను తరలించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

### బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి

**అల్వాల్, జనవరి 25 ప్రభాతవార్త:** దేవుని అల్వాల్‌లోని చారిత్రాత్మకమైన శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం రథసప్తమి ఘనంగా జరిగింది. వందలాదిగా తరలివచ్చిన భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. సూర్యప్రభ వాహనంపై శ్రీవారు పుర వీధులలో విహరించారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలను పండితులు నిర్వహించారు.

### కిస్మత్‌పూర్‌లో మన్‌కీబాత్‌ను తిలకించిన బిజెపి నేతలు

**నార్సింగి, జనవరి 25 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్ డివిజన్‌లో భారత ప్రధాని నరేంద్రమోడీ 130వ మన్‌కిబాత్ కార్యక్రమాన్ని రాష్ట్ర బిజెపి నాయకులు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు అన్నపురెడ్డి భీమార్జున్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బిజెపి రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి వీరేందర్‌గౌడ్, మహాలింగంగౌడ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్, బండ్లగూడ అధ్యక్షులు మహేష్ యాదవ్ తదితరులు సావధానులై దూరదర్శనలో వస్తున్న లైవ్ కార్యక్రమాన్ని చూశారు. ప్రధానమంత్రికి అత్యంత ఇష్టమైన ఈ మన్‌కిబాత్‌లో నిస్వార్థంగా, నిజమైన సేవ చేసే వారిని, మరుగునపడిన మనదైన చారిత్రిక అంశాలను, సంస్కృతిని దేశ ప్రజలందరికి తెలిసేలా చేస్తారని బిజెపి నాయకులు వివరించారు. అనుక్షణం దేశహితం కోసం ఆలోచిస్తూ, పాటు పడుతున్న మహా నాయకుడు నరేంద్రమోడీ అని, ఆయన సంరక్షణలో భారతదేశం సురక్షితంగా పురోగమిస్తుందని తెలిపారు. అగ్రదేశాల జీడీపీలు డీలా పడిపోతున్న నేటి తరుణంలో ఇన్ని ఆంక్షలు పెట్టినా, టారిఫ్‌లు వేస్తున్నా బెణకకుండా భారతదేశం జీడీపీ 7.శాతంకు పైగా ఎగబాగుతుందంటే ఎంత దూరదృష్టితో ఆర్థిక సంస్కరణలు అమలు చేయడం జరుగుతుందో అర్థం చేసుకోవాలన్నారు. నిలువెల్లా దేశభక్తి కలిగిన నేత దేశాన్ని పరిపాలిస్తుండడం వలన అన్ని రంగాలలో మనదేశం అవనిలో అగ్రపీఠంను అందుకోవడం కోసం ఉరుకులు పెడుతుందన్నారు.

### కార్మికుడి మృతిపై విచారణకు టిజిహెచ్ఆర్‌సి ఆదేశం

**జూబ్లీహిల్స్, జనవరి 25, ప్రభాతవార్త:** యూసుఫ్‌గూడ డంపింగ్ యార్డులో ప్రాణాలు కోల్పోయిన కార్మికుడి మృతి సంఘటనపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్(టీజీహెచ్ఆర్‌సీ) స్పందించింది. ఈ సంఘటనపై ఫిబ్రవరి 23లోగా సమగ్రనివేదికను అందించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కమిషన్ ఆదేశించింది. కార్మికుడి మృతి వ్యవహారంలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు జీవించే హక్కు, మానవ గౌరవం, సురక్షిత పని పరిస్థితి ఉల్లంఘనలకు దారి తీసినట్లు గుర్తించామని కమిషన్ పేర్కొంది. పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా ఈ విచారణ చేపట్టినట్లు పేర్కొంది.

### సగర సంఘం నేత అప్పర్ల నాగేశ్వర్‌రావ్ మృతి

**సికింద్రాబాద్, జనవరి 25 ప్రభాతవార్త:** వారాసిగూడకు చెందిన రాష్ట్ర సగర సంగం కార్యనిర్వాక కార్యదర్శి అప్పర్ల నాగేశ్వర్‌రావ్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను సీతాఫల్‌మండిలోని స్మశానవాటికలో నిర్వహించారు. తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పర్ శేఖర్ సాగర్, ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సాగర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రవి సాగర్, రాష్ట్ర సగర సంగం కార్యనిర్వాహక కార్యదర్శి గంట రాజు సగర్‌లు అత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన మృతదేహానికి నివాళులు అర్పించారు.

## రామయంపేటలో ఘనంగా చిత్తారమ్మ జాతర

**దర్శించుకున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, పలువురు నేతలు...**

**రామాయంపేట, జనవరి 25, ప్రభాతవార్త :** రామయంపేట పట్టణంలో శ్రీ చిత్తారమ్మ దేవాలయ 14వ వార్షికోత్సవ (జాతర) వేడుకలు భక్తి శ్రద్ధలతో, అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవంలో భాగంగా ఆదివారంనాడు నిర్వహించిన అమ్మవారి కళ్యాణ మహోత్సవం భక్తుల హృదయాలను ఆకట్టుకుంది. ఆలయ ప్రధాన పూజారి జొన్నోజు నాగరాజు చార్యులతో పాటు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య కళ్యాణం ఘనంగా సాగి, ఆలయ ప్రాంగణం భక్తి మయంగా మారింది. కళ్యాణం అనంతరం మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కు తీర్చుకున్నారు.

**అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు..**

శ్రీ చిత్తారమ్మ జాతరలో మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ఆదివారం నాడు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ చిత్తరమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే రోహిత్ రావుకు శాలువా కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూచిత్తారమ్మ దయతో ప్రజలందరూ బాగుండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లుఎమ్మెల్యేరోహిత్‌రావ్ తెలిపారు. ఆలయకమిటీ నిర్వాహకులు, రామయంపేట పట్టణ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమ్మవారినిదర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కంఠారెడ్డి తిరుపతిరెడ్డి...:**



చిత్తారమ్మ జాతర ఉత్సవాలకు మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి, టీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిలు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులను చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిత్తారమ్మ దేవి కృపా కటాక్షాలతో ఈ ప్రాంతప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో విలసిల్లాలనిఅమ్మవారిని ప్రార్థించా మన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి ృ,పుట్టి యాదగిరి, మద్దెల రమేష్, చింతల రాములు, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సూర్యనమస్కారాలు చేస్తున్న దృశ్యం

## రథసప్తమి నాడు సూర్యనమస్కారాలు

**రామాయంపేట, జనవరి 25, ప్రభాతవార్త :**

రామాయంపేటలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆయుష్ శాఖ యోగ శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని సూర్య నమస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యుని రథం దక్షి ణాయనం నుంచి ఉత్తరాయణం వైపుకు పయనం ప్రారంభించే రోజు రథసప్తమి. దక్షి ణాయనంలో మందగతిలో పయనించే భాస్కరుడు ఉత్తరాయణ ప్రారంభం నుంచి క్రమక్రమంగా తీక్షణమైన కిరణాలతో ప్రకాశిస్తాడు. కావున ఈరోజునసూర్యనమస్కారాలుచేయడంవలన ఆరోగ్యం పెంపొందించుకోవడంతో పాటు ఆధ్యాత్మిక బలం చేకూరుస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ సూర్య నమస్కారాలు ప్రతిరోజూ చేయాలని కోరారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు రామిరెడ్డి, పుట్టి శ్రీనివాస్, మధునాల స్వామి, నవీన్, రవి తదితరులు పాల్గొన్నారు.

## స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



పెద్దశంకరంపేట..మండల కేంద్రానికి చెందిన మంగళి వెంకటేశం అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఆదివారం 1984కు చెందిన ఎస్సెస్సీ పూర్వ విద్యార్థులు బాల్యమిత్రుడి కుటుంబానికి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సుధాకర్, మల్లేషం,సుభాష్,గజవాడనర్సింలు, చంద్రబాబు, కిష్టయ్య, గంగారాంసింగ్, మధు, గోపాల్ గౌడ్, సత్యనారాయణగౌడ్,సంగమేశ్వర్, శ్రీనివాస్, కేశయ్య,మనోహార్,వినోద్,వేణుగోపాలాచారి,రమేష్,శివకుమార్ తదితరులున్నారు.

## ఘనంగా రథసప్తమి వేడుకలు



పెద్దశంకరంపేట.రథసప్తమి పురస్కరించుకొని పెద్ద శంకరంపేట లోని శ్రీ సరస్వతి శిశు మందిర్ లో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నాడు రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మెదక్ జిల్లాశారీరక్ ప్రముక్ భోలమనోజ్ కుమార్‌రథ సప్తమి గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో సామూహిక సూర్య నమస్కారాలు చేశారు. విద్యార్థులు, పెద్దలు సామూహికంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ బాధ్యులు జైహింద్ రెడ్డి. సీతారామారావు. రవివర్మ, మధు సతీష్ గౌడ్, శ్రీనివాస . అధిక సంఖ్యలో స్వయం సేవకులు విద్యార్థులు పాల్గొన్నారు.


గుమ్మడిదల అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పడిన దృశ్యం

## మానవహారం - విద్యార్థులతో ర్యాలీ

**గుమ్మడిదల జనవరి 25 ప్రభాతవార్త**

గుమ్మడిదల మండలంలో 16వ జాతీయ ఓటర్ డే సందర్భంగా మండల తహసిల్దార్ పరమేశం ఆధ్వర్యంలో విద్యార్థులతో ఘనంగా మానవహారం శత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలు పాఠశాలలు, ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, అధికారులు పాల్గొని ఓటు హక్కు ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించారు.ర్యాలీ గుమ్మడిదల మండల కేంద్రంలోని ముఖ్య వీధుల గుండా సాగుతూ ప్రజలను ఆకట్టుకుంది."ఓటు హక్కు మన హక్కు", "ప్రజాస్వామ్యానికి ఓటే బలం", "ప్రతి ఓటు విలువైనది" వంటినినాదాలతోవిద్యార్థులుప్రజాస్వామ్యవిలువలను చాటిచెప్పారు. అనంతరంఏర్పాటు చేసిన మానవహారంలో పాల్గొన్న విద్యార్థులు చేతులు కలిపి ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ కట్టుబాటును ప్రకటించారు.ఈ సందర్భంగా తహసిల్దార్ పరమేశం మాట్లాడుతూ, భారతదేశ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత పవిత్రమైనదని, ప్రతిపౌరుడుతన ఓటుహక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.ఓటువేయడంద్వారా ప్రజలు తమ భవిష్యత్తును, దేశ అభివృద్ధిని నిర్ణయిస్తారని తెలిపారు. ముఖ్యంగా యువతఓటర్‌జాబితాలో తమపేర్లు నమోదు చేసుకొని, ఎన్నికల్లోచురుకుగాపాల్గొనాలనిసూచించారు. అలాగే,అర్హులైన ప్రతిఒక్కరు ఓటర్ ఐడీ పొందాలని, నకిలీ సమాచారం లేదా నిరక్ష ్యంవల్ల ఓటు హక్కు కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని బలపరిచే బాధ్యత ప్రతి పౌరుడిపైనే ఉందని, అది ఓటు ద్వారా మాత్రమే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన అడవి ఆజయ్ అనే యువకుడికి తాసిల్దార్ పరమేశం శాలువాతో సన్మానించారు. హాస్టల్ వార్డెన్ రవికుమార్, ఆర్ ఐ పవన్,మండల స్థాయి అధికారులు, విద్యాసంస్థలఅధ్యాపకులు,సిబ్బంది,ఆశవర్కర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. జాతీయఓటర్ డే సందర్భంగా నిర్వహించిన ఈ మానవహారం, శత ర్యాలీ ప్రజల్లో ఓటు హక్కుపై కొత్త ఉత్సాహాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడ్డారు



## పాముకాటుకు పాడి గేద మృతి

**కోహెడ,జనవరి25, ప్రభాతవార్త :**

మండలపరిధిలోని శ్రీరాములపల్లి గ్రామానికిచెందినచిగురు సంజీవరెడ్డికి చెందిన పాడి గేద పాము కాటుకు మృతి చెందింది. పాడి గేద విలువ రూ.1లక్ష వరకు ఉంటుందని బాధితులుతెలిపారు. బాధితరైతునుప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ కాంగ్రెస్ నాయకుడు, సర్పంచ్‌లు కోరారు.

### అసిస్టెంట్ కుక్‌పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సిద్దిపేట అర్బన్,జనవరి 25, ప్రభాతవార్త :**

కొమురవెల్లి మండలంలోని రాజీవ్ రహదారి పక్కన కొమురవెల్లి కమాన్ సమీపంలోని కేజీవీబీ ధూళ్‌మిట్ల పాఠశాలలో అసిస్టెంట్ కుక్‌గాపని చేయుటకుఅర్హులైన మహిళాఅభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లుమండల విద్యాధికారి మీరంజ నేయులు,స్పెషల్ ఆఫీసర్ ఏ.శివరంజని ఆదివారం తెలిపారు. ఈనెల 26నుంచి 28 వరకు దరఖాస్తులను పాఠశాలలో సమర్పించాలని వారు సూచించారు.

## కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధిపై నిర్లక్ష్యం


పిటి వెంకటపూర్ పాలకవర్గన్ని బిఆర్ఎస్‌లోకి అహ్వానిస్తున్న హరీష్‌రావు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు**

**కొండపాక, జనవరి 25, ప్రభాతవార్త**

రెండు సంవత్సరాల కాలంపాటు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటు పడిందని, తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందింది కేవలం మాజీ సిఎం కెసిఆర్ హయంలోనే అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ఆదివారం కుకునూరుపల్లి మండల పరిధిలోని పిటి వెంకటపూర్ గ్రామానికి చెందిన ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ దబ్బెట భాస్కర్‌తోపాటు అయన పాలకవర్గం సభ్యులు హైదరాబాద్‌లో అయన సమక్షంలో పార్టీలో చేరగా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు..

ఈ సందర్భంగా పార్టీలో చేరిన వార్డు సభ్యులు సుంకొజు వెంకటచారి, పెరిక కిషన్, కడవెరుగు బాల్‌రాజు, శ్రీకాంత్, బుర్రి రాములు, బుర్రి రమేష్ లు గజ్వేల్ ఇంచార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డ అధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. అనంతరం అయన మాట్లాడుతూ కెసిఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న అభివృద్ధిని పట్టించుకోవడంలేదని విమర్శించారు.

ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చకుండా కాలయపన చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిటీసిల ఫోరం రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవి రవీందర్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మణరాజు, మాజీ సర్పంచ్ స్వామి, నాయకులు కిష్టయ్య, వెంకట్‌గౌడ్, బుర్రి కిషన్, రాజు, దబ్బెట సాయిలు, పెరిక చంద్రయ్య, దార గణేష్, దార కనకయ్య, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు నమోదు చేయించుకోవాలి



. మాట్లాడుతున్న హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి

**హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి**

హుస్నాబాద్ రూరల్, జనవరి 24, ప్రభాతవార్త

18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని హుస్నాబాద్ ఆర్డీవో రాంమూర్తి అన్నారు. ఆదివారం రోజున 16వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా హుస్నాబాద్‌లో ఆర్డీవో రామ్మూర్తి, ఎసిపి సదానందం, అధికారులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చౌరస్తాలో విద్యార్థులతో కలిసి ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన వయోజనులకు ఓటర్ కార్డులను పంపిణీ చేశారు. ఎన్నికల్లో స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య విలువలను కాపాడాలన్నారు.

## అభివృద్ధి పనులకుఎమ్మెల్యే భూమి పూజ


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**బెజ్జంకి, జనవరి 25, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని రేగులపల్లిలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలలో ప్రహరి గోడ, డ్రైనేజీ నిర్మాణాలకు,సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే డాక్టక్ కవ్వంపల్లి సత్యనారాయణ భూమి పూజ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, ఎఎంసి చైర్మన్ పులి కృష్ణ, సర్పంచ్ జంగిలి లక్ష్మీ తిరుపతి, ఉపసర్పంచ్ త్రిశూల్, మండల యూత్ అధ్యక్షులు కర్రావుల సందీప్,జిల లింగం, వార్డు సభ్యులు బోనగిరి ప్రసాద్, జంగిలి సంపత్, తిరుపతి,శ్రీధర్, లింగారావు, కుంభం శ్రీకాంత్, లింగారెడ్డి, భూమిరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీను, మాతంగి రమేష్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయితీ భవన నిర్మాణానికి శ్రీకారం

**-భూమి పూజ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే**

**న్యాల్‌కల్, జనవరి 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని న్యామతాబాద్ గ్రామంలో నూతన పంచాయితీ భవన నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించి భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొత్తపల్లి శ్రీకాంత్‌రెడ్డి, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు మున్నూర్ రవీందర్, ఉప సర్పంచ్ జైరాజ్, పంచాయితీ కార్యదర్శి తిరుపతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన గంగాపూర్ సర్పంచ్



**ఝరాసంగం, జనవరి 25, ప్రభాతవార్త:** మండల పరిదిలోని గంగాపూర్ గ్రామ సర్పంచ్ షాహీదా బేగం, ఉప సర్పంచ్ సుజాత, వార్డు సభ్యులు మొగులమ్మ, నాగలక్ష్మి, మలన్‌బీ, గొల్ల యాదయ్య, బాబుమియా, సంజీవ్‌కుమార్, పాషా, గోరేమియా షకీల్, బస్వరాజ్, కష్టప్ప, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరగా ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ మల్కాపురం శివకుమార్‌లు పార్టీ ఖండువాలు కప్పి కారెక్కించుకున్నారు. కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ అధ్యక్షులు వెంకటేశం, కేతకి సంగమేశ్వర ఆలయ మాజీ చైర్మన్ నీల వెంకటేశం గుప్తా, నరసింహాగౌడ్, తుమ్మనపల్లి సర్పంచ్ సోహిల్, మాజీ సర్పంచ్‌లు బస్వరాజ్ పాటిల్, ప్రభు పాటిల్, నాయకులు సత్యం ముదిరాజ్, గ్రామ మాజీ సర్పంచ్ శివరాజ్ పాటిల్, ఉమేష్ పాటిల్, నజీమ్ పటేల్, మస్తాన్, ధనరాజ్, సామెల్, బక్కప్ప, నర్సింలు, గొల్ల అంజయ్య, బీరప్ప, రమేష్, మోసిన్, గోపాల్, సురప్ప, బాబురావు, భీమ్‌రావు తదతరులు పాల్గొన్నారు.

## లియాఫీ ఆధ్వర్యంలో ఏజెంట్స్ ప్రొటెక్షన్ డే



**జహీరాబాద్,జనవరి25, ప్రభాతవార్త:** లియాఫీ ఆధ్వర్యంలో జహీరాబాద్ పట్టణంలో జీవిత భీమా కార్యాలయంలో ఏజంట్స్ ప్రొఫెషన్ ప్రొటెక్షన్ దినోత్సవ వేడుకలను ఎల్ఐసి ఏజంట్లు ఆదివారం జహీరాబాద్ బ్రాంచ్ లియాఫీ అధ్యక్షులు ఈడ్గి విఠల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏజంట్లు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విఠల్‌గౌడ్ మాట్లాడుతూ ఎల్ఐసి ఏజంట్లు వృత్తిలో ఎదుర్కొంటున్న సమస్యలను 1964 నుంచి లియాఫీ పరిష్కరిస్తున్న తీరుపై వివరించారు. ఏజంట్లకు కావాల్సిన అన్ని రకాల హక్కులను లియాఫీ సమకూరుస్తూ వస్తోందన్నారు. కార్యక్రమంలో లియాఫీ ట్రెజరర్ పోలీస్ ప్రవీణ్‌పాటిల్, నాయకులు యస్ నాగన్న, కె రాములు, జి గుండప్ప, వడ్ల ప్రభు, కెకె రెడ్డి, ఎస్ శ్రీనివాస్, ఉమా మహేశ్వర్‌రావు, సిహెచ్ బాబుజీ, పిప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, సంతోష్‌కుమార్‌శ్యామయ్య,ఏజంట్లు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో జాతీయ ఓటర్ దినోత్సవం

**జహీరాబాద్,జనవరి 25, ప్రభాతవార్త:**

జాతీయ ప్రధాన ఓటర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని జహీరాబాద్ పట్టణంలో ఆదివారం రెవిన్యూ, మున్సిపల్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఓటర్స్ డే ర్యాలీలో ఆర్‌డిఓ దేవుజ నాయక్, మున్సిపల్ కమిషనర్ జైత్రామ్, తహసీల్దార్ పి దశరథ్, ఎస్ఐ కె వినయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు ఎన్నికల్లో తమఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.